# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

14.5.2026
గురువారం Thursday

సంపుటి (volume): 1
సంచిక (Issue): 285

పేజీలు : 12
Pages : 12

వెల రూ.2.00

Published from : Hyderabad
Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944
7897222788 - 7897222789




## నీట్ పేపర్ లీక్‌లో సీబీఐ దూకుడు

దేశంలో ఏకకాలంలో సోదాలు
ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటన

2

## రైతుల ఖాతాల్లోకి 4,520 కోట్లు



30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

పౌర సరఫరాల శాఖ అధికారుల వెల్లడి

2

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్



వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ కేటీఆర్ ట్వీట్

ఏడీఆర్ నివేదికను ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు

.. వివరాలు 2లో



## లిఫ్ట్‌లో చిన్నారి మృత్యువాత

నుజ్జునుజ్జు అయిన తల

.. వివరాలు 2లో



## బక్రీద్ వేళ పకడ్బందీ నిఘా

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు
డీజీపీ సీవీ ఆనంద్

.. వివరాలు 2లో



## ప్రేమ, పెళ్లి పేరుతో మోసం

మహిళా కానిస్టేబుల్‌ను వంచించిన ఎస్ఐ
కొల్లూరు ఎస్ఐ సురేశ్ సస్పెన్షన్

.. వివరాలు 2లో

# ఖమ్మం, వరంగల్, కరీంనగర్‌కు ఓఆర్ఆర్‌లు

## విమానాశ్రయాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణం

- ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టు..
- ప్రతి మున్సిపాలిటీలో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు
- నల్గొండ - యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్
- మెగా గ్రోత్ కారిడార్‌పై ముఖ్యమంత్రి సమీక్ష..




**హైదరాబాద్, మే 13 :** తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్ల పరిధిలో వెలుపలి వలయ రహదారుల (ఓఆర్ఆర్) నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చజెండా ఊపారు. రాష్ట్రంలో ఏర్పాటు కాబోయే కొత్త విమానాశ్రయాలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రహదారులను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. మెగా గ్రోత్ కారిడార్‌పై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో సీఎం మాట్లాడుతూ, పట్టణాల కేంద్రంగానే సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో అత్యాధునిక సాంకేతికతను జోడించాలని సూచించారు. అండర్ డ్రైనేజీల నిర్మాణానికి నూతన సాంకేతికతను వాడుకోవాలని, అవసరమైన చోట ఎస్టీపీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఖర్చు తగ్గించేందుకు వీలుగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాలని, ప్రతి మున్సిపాలిటీలో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేసి పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే అభివృద్ధి పనులకు వెచ్చించాలని వెల్లడించారు. రాష్ట్రంలో పర్యాటక, ఆధ్యాత్మిక రంగాన్ని ప్రోత్సహించేందుకు పలు కారిడార్లను రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్, అలాగే ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలని సూచించారు. మహబూబ్‌నగర్ - భూత్పూర్ - జడ్చర్ల మరియు కొత్తగూడెం - పాల్వంచ - సుజాతనగర్‌లను కలుపుతూ ప్రత్యేక కారిడార్లను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు పనులు సాగుతాయని, వరంగల్, కరీంనగర్, ఖమ్మం కారిడార్ రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

మిగతా 2 లో

## హైదరాబాద్‌లో ఊబర్ ఎక్సలెన్స్ సెంటర్

ఫ్యూచర్ సిటీలో ఊబర్ కార్పొరేట్ ఆఫీస్

సీఎంతో సీఈవో దారా ఖోస్రోషాహి భేటీ



2

## బలపరీక్షలో నెగ్గిన సీఎం విజయ్



ఓటింగ్‌ను బహిష్కరించిన డీఎంకే..
మద్దతుగా అన్నాడీఎంకే రెబల్ వర్గం

4



## చమురు సంక్షోభం పొదుపు మంత్రం

- కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన మోడీ
- రెండు కార్లతో ఢిల్లీ వీధుల్లో ప్రధాని పయనం
- అదేబాటలో హోంమంత్రి అమిత్ షా
- రాష్ట్రాల సీఎంల కాన్వాయ్‌ల కుదింపు

4

## పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల అనివార్యం

ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

వివరాలు 4వ పేజీలో



## తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

బండి భగీరథ్ విషయంలో వెనకడుగు లేదు
మంత్రి సీతక్క స్పష్టీకరణ

3

## అరెస్ట్ తప్పదు

పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

# బండి భగీరథ్ అబ్‌స్కాండింగ్

## నగరంలో పలుచోట్ల పోస్టర్ల కలకలం

**హైదరాబాద్, మే 13:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో బండి భగీరథ్ అబ్‌స్కాండింగ్ అంటూ పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో 'బండి భగీరథ్ పరారీలో ఉన్నాడు. ఆచూకీ తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి' అని రాసి ఉంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి.

మిగతా 2 లో




## బండి భగీరథ్‌కు లుక్ అవుట్ నోటీసులివ్వాలి

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

3



## పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరు

2

## ఆధారాలతో రేపు వస్తా

పోలీసులకు బండి భగీరథ్ లేఖ




# బండి భగీరథ్ అబ్స్కాండింగ్

## నగరంలో పలుచోట్ల పోస్టర్ల కలకలం

**హైదరాబాద్, మే 13:** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో బండి భగీరథ్ అబ్స్కాండింగ్ అంటూ పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో 'బండి భగీరథ్ పరారీలో ఉన్నాడు. ఆచూకీ తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయండి' అని రాసి ఉంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా బండి భగీరథ్ మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని.. అతడు పరారీలో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. భగీరథ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. తనపై లైంగిక దాడి చేశాడంటూ భగీరథ్‌పై బాలిక ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందిస్తూ.. తక్షణమే చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. దీంతో ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్న సిట్.. భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. మరోవైపు తనకు ముందుస్తు బెయిల్ ఇవ్వాలంటూ భగీరథ్.. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# విచారణకు భగీరథ్ గైర్హాజరు

**హైదరాబాద్, మే 13:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్.. పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఈ కేసును విచారిస్తోంది. ఇందులో భాగంగా విచారణకు రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పోలీసుల ముందు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే సమయం గడిచినప్పటికీ భగీరథ్.. పోలీసుల విచారణకు హాజరుకాలేదు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లను పోలీసులు జోడించారు. బాధితురాలి నుంచి రెండో సారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. తాజాగా నిందితుడిపై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసి లైంగిక చర్యలకు పాల్పడినట్లు సెక్షన్ 5 (తి)ను కూడా పోలీసులు జతపరిచారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్ వేశారు. గురువారం ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేయనుంది.

# రేపు ఆధారాలతో వస్తా

## పోలీసులకు బండి భగీరథ్ లేఖ

**హైదరాబాద్, మే 13:** పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని తన లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మే 15వ తేదీన జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే భగీరథ బెయిల్ కేసులో గురువారం 14న హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

# ప్రేమ, పెళ్లి పేరుతో మోసం

## మహిళా కానిస్టేబుల్‌ను వంచించిన ఎస్ఐ

## కొల్లూరు ఎస్ఐ సురేశ్ సస్పెన్షన్



**హైదరాబాద్, మే 13:** మహిళా కానిస్టేబుల్‌ను ప్రేమ పేరుతో ఓ ఎస్సై మోసం చేశాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాక ఉన్నతాధికారులు సదరు ఎస్సైని సస్పెండ్ చేశారు. ప్రేమిస్తున్నాను అంటూ నమ్మించి.. పెళ్లి పేరుతో కాలయాపన చేస్తూ తప్పించుకు తిరుగుతున్న కొల్లూరు పోలీస్ స్టేషన్ ఎస్సై సురేష్ కుమార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ లో మహిళా కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతిని.. పెళ్లి చేసుకుంటానని చెప్పి ప్రేమ పేరుతో మోసం చేసినట్లు కేసు నమోదు కావటంతో.. ఈ నిర్ణయం తీసుకున్నారు ఉన్నతాధికారులు. పూర్తి వివరాల్లోకి వెళితే..2018 బ్యాచ్ ఎస్సై సురేష్ కుమార్.. కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తున్న యువతితో పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పటంతో.. ఎస్సై సురేష్ కు దగ్గరైంది ఆ మహిళా కానిస్టేబుల్. కొన్నాళ్లుగా పెళ్లి విషయంపై ఒత్తిడి చేస్తుంది. సాకులు చెబుతూ.. పెళ్లిని వాయిదా వేస్తూ వస్తున్నారు ఎస్సై సురేష్ కుమార్. పెళ్లి వాయిదాపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. వెంటనే పెళ్లి చేసుకోవాలని మహిళా కానిస్టేబుల్ పట్టుబట్టింది. పెళ్లి విషయంలో ఎస్సై సురేష్ కుమార్ తప్పించుకునే ప్రయత్నం చేస్తుండటంతో.. మహిళా కానిస్టేబుల్ గట్టిగా నిలదీసింది. పెళ్లి చేసుకునేది లేదని.. పెళ్లి చేసుకోవటం కుదరదు అని తేల్చి చెప్పారు ఎస్సై సురేష్. ఈ క్రమంలోనే ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసినట్లు కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో కంప్లయింట్ చేసింది మహిళా కానిస్టేబుల్. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎస్సై సురేష్ ను విచారించేందుకు ప్రయత్నించారు. అతని సెల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ లో ఉండటంతో.. విచారణకు స్పందించకపోవటం.. అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో.. ఎస్సై సురేష్ కుమార్ ను సస్పెండ్ చేశారు ఉన్నతాధికారులు. బాధితురాలు మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఆధారాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బాధిత యువతి ఇచ్చిన ఆధారాలతో పోలీస్ ఉన్నతాధికారులు అతణ్ని సస్పెండ్ చేశారు.

# హైదరాబాద్‌లో ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్

## ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పోరేట్ ఆఫీస్

## సీఎంతో సీఈవో దారా ఖోస్రోషాహి భేటీ



**హైదరాబాద్, మే 13:** హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు. పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# నీట్ పేపర్ లీక్‌లో సీబీఐ దూకుడు

## దేశంలో ఏకకాలంలో సోదాలు

## ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటన



**న్యూఢిల్లీ, మే 13:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీబీఐ అధికారులు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసులో సీబీఐ తన దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి సోదాలు నిర్వహిస్తోంది. ఈ లీకేజ్ వెనుక ఉన్న ప్రధాన ముఠాను బయటకు తీసుకురావడానికి అధికారులు కృషి చేస్తున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ప్రత్యేక బృందాలు రాజస్థాన్, హరియాణా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. సోదాల సమయంలో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లు, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రశ్నాపత్రం లీక్, మధ్యవర్తుల వ్యవస్థ, భారీ మొత్తాల్లో డబ్బుల లావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఈ వ్యవహారంలో పరీక్షకు ముందుగానే కొందరు అభ్యర్థులకు ప్రశ్నాపత్రం అందించినట్లు అనుమానిస్తున్నారు. సీబీఐ అధికారులు ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందినవారు కాగా, ఒకరు హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన వ్యక్తి. మరొకరు మహారాష్ట్ర లోని నాసిక్ ప్రాంతానికి చెందినవారు. అరెస్టయిన వ్యక్తులు ప్రశ్నాపత్రం సేకరణ, పంపిణీ, అభ్యర్థులతో సంబంధాలు ఏర్పరచడం వంటి కీలక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి కస్టడీకి తీసుకుని సమగ్రంగా విచారిస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జమ్వా రామ్‌గఢ్ ప్రాంతానికి చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ సోదరులను సీబీఐ అధికారులు బుధవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఈ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాన మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్నారు. వారి ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో పలు డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, అభ్యర్థుల జాబితాలు లభించినట్లు సమాచారం. వీరి ద్వారా మరికొందరు అనుమానితుల వివరాలు కూడా సీబీఐకి లభించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌లో సోదాలు కొనసాగుతుండగానే మహారాష్ట్రలో కూడా సీబీఐ తన దర్యాప్తును విస్తరించింది. అక్కడ ఇద్దరు మహిళలను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మహిళలు అభ్యర్థులు, మధ్యవర్తుల మధ్య సంబంధాలు ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, సోషల్ మీడియా కమ్యూనికేషన్‌లను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారం అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు భావిస్తున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. ఢిల్లీలోని 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్నీ సందర్శించి.. రద్దయిన పరీక్షకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సేకరించింది. ఈ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులతో సీబీఐ బృందం మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

# బక్రీద్ వేళ పకడ్బందీ నిఘా

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

## రాష్ట్రవ్యాప్తంగా 203 చెక్ పోస్టుల ఏర్పాటు..

## సరిహద్దుల్లో సిబ్బందితో తనిఖీలు ముమ్మరం

## డీజీపీ సీవీ ఆనంద్



**హైదరాబాద్, మే 13:** ఈ నెల 27న జరగనున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. రానున్న 15 రోజుల్లో పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, రవాణా చేసే పశువులకు సంబంధించి వెటర్నరీ డాక్టర్ల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, మున్సిపల్, పశు సంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలని డీజీపీ తెలిపారు. సీజ్ చేసిన పశువుల కోసం తగిన సౌకర్యాలతో 'క్యాటిల్ పాండ్‌లను' సిద్ధం చేయాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కె. ఇలంబర్తి మాట్లాడుతూ, సర్టిఫికెట్లు ఇచ్చేందుకు వెటర్నరీ డాక్టర్లు నిరంతరం అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పుకార్లు పుట్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలు మీరే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని డీజీపీ హెచ్చరించారు.

# రైతుల ఖాతాల్లోకి 4,520 కోట్లు

## 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

## పౌరసరఫరాల శాఖ అధికారుల వెల్లడి

**హైదరాబాద్, మే 13:** 2025-26 రబీ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా మరియు సమర్థవంతంగా నిర్వహించేందుకు పౌరసరఫరాల శాఖ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తోంది. ఇప్పటి వరకు విజయవంతంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మార్గదర్శకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా కనీస మద్దతు ధర కింద రూ. 4,520 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. ర్గ÷తులు సన్న మరియు దొడ్డు రకాల ధాన్యాన్ని భారీగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మిగిలిన 21 లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యాన్ని సేకరించడం జరిగింది. ÷-రస్తుతం ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, భారీగా వస్తున్న ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఈ విస్తృతమైన క్షేత్రస్థాయి వ్యవస్థలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4,350 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 3,563 కేంద్రాలు, మరియు ఇతర అనుబంధ సంస్థల ద్వారా 662 కేంద్రాలు నడుపబడుతున్నాయి. కొనుగోలు కార్యకలాపాలు సజావుగా సాగడానికి మరియు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని పూర్తిగా సంరక్షించడానికి, పౌరసరఫరాల శాఖ ముందస్తుగానే ఈ కేంద్రాల వద్ద 18.6 కోట్ల గన్నీ బ్యాగ్‌లను మరియు తగిన సంఖ్యలో టార్పాలిన్లను సిద్ధంగా ఉంచింది. క్షేత్రస్థాయిలో నిల్వల సమస్య తలెత్తకుండా మరియు కొనుగోలు కేంద్రాలు ప్రతిరోజూ కొత్త ధాన్యాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉండేలా, పౌరసరఫరాల శాఖ వేగవంతమైన రవాణా కార్యకలాపాలను అమలు చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాప్యం లేకుండా నేరుగా కేంద్రాల నుండి మిల్లులకు తరలించడానికి లారీలు, ట్రాక్టర్లు, డీసీఎంలతో కూడిన సుమారు 11,500 రవాణా వాహనాలను అందుబాటులో ఉంచింది. అంతేకాకుండా, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ ప్రక్రియలను దగ్గరుండి పర్యవేక్షించడానికి, పారదర్శకతను నిర్ధారించడానికి కొనుగోలు కేంద్రాలతో పాటు మిల్లుల వద్ద కూడా ప్రత్యేక అధికారులను వ్యూహాత్మకంగా నియమించింది. హమాలీల కొరతను అధిగమించడానికి, భారీగా వస్తున్న ధాన్యాన్ని సజావుగా నిర్వహించడానికి, రైతుల ప్రయోజనాలను కాపాడుతూ కొనుగోళ్లను వేగవంతం చేయడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొనుగోలు కేంద్రాలు, గోదాములలో ధాన్యం నిర్వహణ చార్జీలను అధికారికంగా క్వింటాల్‌కు రూ. 17/- కి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానాలతో రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో చెల్లింపులు జరిగేలా చూస్తోంది. ర్గ÷తులు తమకు ఏవైనా సందేహాలు, సమస్యలు ఉన్నా లేదా సహాయం కావాలన్నా పౌరసరఫరాల శాఖకు చెందిన టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1967 ను సంప్రదించాలని తెలిపింది.

# లిఫ్ట్‌లో చిన్నారి మృత్యువాత

## గచ్చిబౌలి హాస్టల్‌లో ఐదేళ్ల చిన్నారి మృతి

**హైదరాబాద్, మే 13:** గచ్చిబౌలిలో తీరని విషాదం చోటుచేసుకుంది. లిఫ్టులో ఇరుక్కుని మరో చిన్నారి మృత్యువాత పడింది. గౌలిదొడ్డిలోని ఒక ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో ఓ బాలిక లిఫ్ట్‌లో ఇరుక్కుని మృతి చెందింది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఒక కుటుంబం ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి.. గౌలిదొడ్డిలోని మహి ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆ కుటుంబానికి చెందిన ఐదేళ్ల చిన్నారి బిస్తూ గోష్, స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. బుధవారం ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ ఆ చిన్నారి గ్రౌండ్ ఫ్లోర్ నుండి ఐదో అంతస్తుకు వెళ్తున్న క్రమంలో.. మూడవ అంతస్తు వద్ద చిన్నారి జుట్టు లిఫ్ట్ డోర్లలో ఇరుక్కుపోయింది. అది గమనించేలోపే లిఫ్ట్ కదలడంతో.. చిన్నారి తల నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న స్థానికులు డయల్ 100కు కాల్ చేయగా.. పోలీసులు, హైడ్రా, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన చిన్నారి మృతదేహాన్ని అత్యంత శ్రమతో బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం ఉందా? అనే కోణంలో విచారణ సాగుతోంది. ఐదేళ్ల చిన్నారి కళ్లముందే విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



# క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

**వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ కేటీఆర్ ట్వీట్**

**హైదరాబాద్, మే 13:** తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే పెరిగాయని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోంమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆయన నాయకత్వంలో ఇప్పుడు తెలంగాణ మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో కూడా టాప్‌లో ఉంది.' అని ట్విట్టర్ (ఎక్స్)లో కేటీఆర్ పేర్కొన్నారు. వెల్‌డన్ రాహుల్ గాంధీ.. నిజంగానే తెలంగాణ రైజింగ్ అంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యంగ్యంగా అభినందించారు.

# విపక్షనేతల అంటే లెక్కలేదా ?

**మోడీ తీరుపై మండిపడ్డ వీహెచ్**



**హైదరాబాద్, మే 13:** మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ప్రభుత్వ సలహాదారు వీ హనుమంతరావు విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యం అంటే లెక్కలేకుండా పోయిందన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అని మోదీ భావిస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ డైరెక్టర్ అపాయింట్మెంట్ విషయంలో అపోజిషన్ లీడర్ అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేత అభిప్రాయం తీసుకోకపోవడంతో రాహుల్ గాంధీ లేఖ రాసినట్లు చెప్పారు. ప్రధానికి రాహుల్ లేఖ రాయడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. మోదీకి అనుకూలంగా ఉన్న వాళ్లను సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తారా అని వీహెచ్ ప్రశ్నించారు. భజన చేసే వాళ్లకే మోదీ.. పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. రాహుల్ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వీహెచ్ తెలిపారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తోందని మండిపడ్డారు. జనగణనలో బీసీ కాలమ్ లేకపోవడం అన్యాయమన్నారు. ఆర్ఎస్ఎస్ చేతిలో నరేంద్ర మోదీ కీలు బొమ్మగా మారారని దుయ్యబట్టారు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' అబద్ధమని... బీజేపీ వికాసం మాత్రమే జరుగుతోందని వీహెచ్ వ్యాఖ్యానించారు

# ఇంటర్ పరీక్ష రాసిన మాజీ మావోయిస్ట్ దేవ్‌జీ



**జగిత్యాల, మే 13:** మావోయిస్టు మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఇంటర్ పరీక్షకు హాజరయ్యారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత జగిత్యాల జిల్లా కోరుట్లలో ఆయన ఈ పరీక్ష రాశారు. 1980–82లో దేవ్‌జీ కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివారు. విద్యార్థి రాడికల్ యూనియన్‌లో పనిచేస్తున్న సమయంలో సెకండియర్ తెలుగు పరీక్షను ఆయన బహిష్కరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మావోయిస్టు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసిన ఆయన.. ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతితో పరీక్ష రాశారు. బుధవారం కోరుట్లలోని మ్యాస్టో జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్ష రాశారు. న్యాయవాద కోర్సు చేసి పేదల కోసం పనిచేస్తానని దేవ్‌జీ చెప్పారు.

# సీఎంను కలిసిన ప్రముఖులు



**హైదరాబాద్, మే 13:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో పలువురు ప్రముఖులు కలిశారు. వీరంతా సీఎంను మర్యాదపూర్వకంగా కలిసారు. లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ రీజినల్ చైర్మన్ రామన్ రఘు, రీజనల్ డైరెక్టర్ జెవి రాజగోపాల్ రావు, సైనిక్ సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్ఆర్ బాబులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

# తప్పు చేస్తే ఎంతటివారైనా శిక్షార్హులే

- భగీరథ్ విషయంలో వెనకడుగు లేదు
- మంత్రి సీతక్క స్పష్టీకరణ



**మహబూబాబాద్, మే 13:** భగీరథ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోక్సో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కారణంగా కేసు నమోదు చేయడంలో ఒక్క రోజు ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని మంత్రి సీతక్క ఒప్పుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన కేసు వివాదంపై మంత్రి సీతక్క స్పందించారు. కేంద్ర మంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా తప్పు చేస్తే శిక్ష పడాల్సిందేనని అన్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం కాలయాపన కోసం కాదని, నిజానిజాలు వెలికితీయడానికేనని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలు మహిళలను గౌరవించాలని, ప్రజలను ప్రేమించాలని ఈ సందర్భంగా సీతక్క విజ్ఞప్తి చేశారు. బాలికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. బుధవారం పోలీసుల ఎదుట భగీరథ్ హాజరుకావాల్సి ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ నెల 15వ తేదీన విచారణకు హాజరవుతానని పేర్కొంటూ పేట్ బషీరాబాద్ పోలీసులకు, సిట్ అధికారులకు ఈ-మెయిల్‌తో పాటు భగీరథ్ ఓ లేఖ పంపించారు.

# బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

- ఆయనను రక్షించాల్సిన అవసరం మాకేముంది
- మీడియాతో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



**హైదరాబాద్, మే 13:** పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు లేదన్నారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని అన్నారు. మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ÷ుాఎఫ్‌తో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

# బండి భగీరథ్‌కు లుక్ అవుట్ నోటీసులివ్వాలి

**పొదుపు సూత్రాలు తెలంగాణకు**

**నిధులు మాత్రం ఆంధ్రాకా?**

**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత**



**హైదరాబాద్, మే 13:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ుఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

# అత్యధిక మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకు పురస్కారం

**నేడు మంత్రి పొన్నం చేతుల మీదుగా అందచేత**



**హైదరాబాద్, మే 13:** రాష్ట్రంలోని బీసీ గురుకుల, బీసీ హాస్టల్‌లో ఉంటూ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకుఈనెల 14న ప్రతిభా పురస్కారాలు అందిస్తుందని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంజారా హిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసి భవన్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారాలు అందిస్తున్నామని వివరించారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రతిభావంతులైన 508 మంది విద్యార్థులను సన్మానిస్తామన్నారు. పదో తరగతి ఫలితాలలో మహాత్మా జ్యోతిభా పూలే నుంచి 147 మంది విద్యార్థులు (576 కటాఫ్), బీసీ హాస్టల్ విద్యార్థులు 67 మంది (550 కటాఫ్) కి మెత్తం 214 మంది విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం 137 మంది విద్యార్థులు (988 కటాఫ్/1000), 28 మంది బీసీ హాస్టల్ విద్యార్థులు మొత్తం 165 మంది విద్యార్థులను సత్కరిస్తామని అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో (467/437/493 కటాఫ్) సాధించిన 107 మంది విద్యార్థులు, 22 మంది బీసీ హాస్టల్ విద్యార్థులు మొత్తం 129 మంది విద్యార్థులను సన్మానిస్తామని ఆయన తెలిపారు.

# పోక్సో కేసును కులానికి ఆపాదించే యత్నం

**ఇది కుల సమస్య కాదని గుర్తించాలన్న గంగుల**



హైదరాబాద్, మే 13: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ్ విషయంలో బీఆర్ఎస్ బాధితురాలి పక్షాన ఉందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నేతల ఒత్తిడితోనే కేంద్ర మంత్రి కొడుకుపై కేసు నమోదు చేశారన్నారు. బండి సంజయ్ కొడుకు పోక్సో కేసును కులానికి ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది కుల సమస్య కాదు. లా అండ్ ఆర్డర్ సమస్య. నిన్న కరీంనగర్ లో బెదిరింపు ధోరణిలో మాట్లాడిన బండి సంజయ్ ఎవరి అంతు చూస్తావ్..? బాధితురాలిని అంతం చేస్తావా, లేకపోతే ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళను అంతం చేస్తావా..? అని గంగుల ప్రశ్నించారు. చట్టానికి, పోలీసులకు బండి సంజయ్ కుమారుడు సహకరించాలన్నారు. కాగా బండి సాయి భగీరథ్‌పై ఇప్పటికే పోక్సో కేసు నమోదుచేసిన పోలీసులు.. అతడిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తాజాగా కొన్ని సెక్షన్లను అదనంగా చేర్చారు. పోక్సో చట్టం సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జత చేశారని తెలిసిందే. ఇంతకుముందు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో చట్టం, బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారి రితిరాజ్‌కు అప్పగించిన నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.



సంపాదకీయం

# ఎన్‌టీఏ వైఫల్యం విద్యార్థులకు శాపం!

కొందరు మాఫియాతో చేతులు కలపడం వల్లనే పేపర లీకేజీలు జరుగుతున్నాయి. వారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. నీట్ పేపర్ దోషులకు కఠిన శిక్షలు పడితే తప్ప ఇలాంటి తప్పిదాలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఒకప్పుడు టెన్త్ లేదా ఇంటర్ పరీక్ష పేపర్లు లీక్ అయితే సంబంధిత మంత్రి రాజీనామా చేసేవారు. అంతగా నైతిక బాధ్యత వహించేవారు. కానీ నీట్ పేపర్ లీక్ కావడం లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలో పడేసింది. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందుబాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకోవడంతో ఇలాంటి బాధలు ఉండేవి కావు. నీట్‌ను తమిళనాడు అస్సలు ఒప్పుకోలేదు. కానీ 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎను తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్ లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరించాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్‌టిఎ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ అనర్హులు, అక్రమార్కులు భాగస్వాములు కావడం వల్ల ఇవాళ నీట్ పరీక్ష రద్దుకు కారణమయ్యింది. గతంలో నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వక పోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు కలకలం రేపాయి. చర్చనీయాంశం అయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్ ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్‌టిఎ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటే పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై కనీసంగా మాట్లాడడం లేదు. అవిశ్రాంతంగా శ్రమించి ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ ఇప్పుడు ఎందుకు మాట్లాడరన్నదే ప్రశ్న. నిజానికి నీట్ పరీక్షను తప్పించి ఆయా రాష్ట్రాలకు మునుపటి మాదిరి ఎంసెట్ నిర్వహించుకునే వెసలుబాటు కల్పించడం మేలు. లేదా నీట్ వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలి. సిబిఐ విచారణకు ఆదేశించినా అది ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా అనుమానమే. పేపర్ లీక్ పై కేంద్రప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ)-2026 పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించటం అనేక మంది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది కలిగించే నిర్ణయమేనని చెప్పకతప్పదు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. పరీక్ష రద్దు నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా ఈ అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. అయితే, ఈసారి ఏజెంట్లు ఒకర్ని మించి మరొకరు సొమ్ము చేసుకునే ఉద్దేశంతో విచ్చలవిడిగా పేపర్‌ను అమ్మటంతో ఈ వ్యవహారం బయటపడింది. ఇలా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం కేవలం కేంద్ర వైఫల్యంగానే చూడాలి. వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం. ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటు లోకి వచ్చిన 'అంచనా పేపర్' లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చన్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధికారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో కేంద్రం కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

# చమురు సంక్షోభం.. పొదుపు మంత్రం

- కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన మోడీ
- రెండు కార్లతో ఢిల్లీ వీధుల్లో ప్రధాని పయనం
- అదేబాటలో హోంమంత్రి అమిత్ షా
- రాష్ట్రాల సీఎంల కాన్వాయ్‌ల కుదింపు



**న్యూఢిల్లీ, మే 13:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ముడి చమురు ధరలపై తీవ్రంగా పడుతోంది. ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, దేశీయంగా ఇంధన వినియోగాన్ని తగ్గించి పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేవలం పిలుపునివ్వడమే కాకుండా, స్వయంగా తన నుండే ఈ మార్పును ప్రారంభిస్తూ ప్రధాని సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన భద్రత కోసం వినియోగించే కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను ఏకంగా 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని ఎస్‌పీజీని ఆదేశించారు. భద్రతా ప్రోటోకాల్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండానే, ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ప్రధాని ఆదేశాలతో ఎస్‌పీజీ ఇప్పటికే ఈ దిశగా కార్యాచరణను ప్రారంభించింది. చమురు సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో



భాగంగా విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని ప్రధాని నిర్ణయించారు. అయితే, ఇందుకోసం కొత్త కార్లను కొనుగోలు చేయవద్దని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న విద్యుత్ వాహనాలనే గరిష్టంగా వినియోగించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడకుండా ఆయన తీసుకున్న ఈ నిర్ణయం చర్చనీయాంశమైంది.

### రెండు కార్లతో మోడీ పయనం

ప్రధాని మోదీ చెప్పినట్లుగానే తన భద్రతా కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను భారీగా తగ్గించారు. ఇంధనం పొదుపుకోసం తన కాన్వాయ్‌లో 50శాతం వాహనాలను తగ్గించాలని ఆదేశించిన కొద్దిగంటల్లో అమలు చేసారు. కేవలం రెండు కార్ల కాన్వాయ్‌తో ప్రయాణం చేస్తున్నారు. ప్రధాని మోదీ కాన్వాయ్‌లో కేవలం రెండు వాహనాలు మాత్రమే కనిపించడం చర్చనీయాంశమైంది. ఢిల్లీ వీధుల్లో ప్రధాని కాన్వాయ్ దృశ్యాలు కనిపించాయి. వీటికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

### అమిత్ షా సహా పలువురు సీఎంల బాట


ప్రధాని బాటలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లోని వాహనాలను సగానికి తగ్గించుకున్నారు. కేంద్ర మంత్రులతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులు కూడా తమ కాన్వాయ్‌లను కుదించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇతర ప్రభుత్వ శాఖలు సైతం ఇంధన పొదుపుపై సమీక్షలు జరుపుతున్నాయి. ముడి చమురు దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు ప్రస్తుత సంక్షోభం సవాలుగా మారిన తరుణంలో, అగ్రనేతలు తీసుకుంటున్న ఈ పొదుపు చర్యలు సామాన్య ప్రజలకు కూడా ఒక సంకేతాన్ని పంపిస్తున్నాయి. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ, ఎంపీ సీఎం మోహన్ యాదవ్‌లతో సహా ఇతర మంత్రులు కూడా తమ అధికారిక కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను తగ్గించుకున్నారు.

# బంగారం, వెండి ప్రియులకు షాక్

### కస్టమ్స్ డ్యూటీ 15 శాతానికి పెంపు!

### రూపాయి పతనం, చమురు సంక్షోభం నేపథ్యంలో కేంద్రం కఠిన నిర్ణయం

**న్యూఢిల్లీ, మే 13:** దేశంలో పసిడి, వెండి ధరలకు మరింత రెక్కలు రానున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, రూపాయి విలువ క్షీణత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 6 శాతంగా ఉన్న మొత్తం దిగుమతి సుంకాన్ని ఏకంగా 15 శాతానికి పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో బేసిక్ కస్టమ్స్ డ్యూటీ 10 శాతానికి చేరుకోగా, దీనికి అదనంగా 5 శాతం అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను జోడించారు. వెరసి, మొత్తం దిగుమతి సుంకం 15 శాతానికి పెరిగింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో ₹95.75కి పడిపోవడంతో ప్రభుత్వం ఈ అప్రమత్తత చర్యలు చేపట్టింది. ప్రపంచంలో బంగారం వినియోగంలో భారత్ రెండో స్థానంలో ఉండగా, వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉంది. దేశీయ అవసరాల కోసం మనం ప్రధానంగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. గతేడాది ఈక్విటీ మార్కెట్లలో రాబడులు తగ్గడంతో, పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గు చూపారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, మార్చి త్రైమాసికంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు గతేడాది కంటే 186 శాతం పెరిగాయి. ఇప్పటికే బంగారం ధరలు గరిష్ఠ స్థాయిల్లో ఉండగా, తాజా సుంకాల పెంపుతో డిమాండ్ మరింత తగ్గే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. గతంలో ప్రభుత్వం 3 శాతం ఐజీఎస్‌టీ విధించినప్పుడు బ్యాంకులు నెల రోజుల పాటు దిగుమతులను నిలిపివేయడంతో, ఏప్రిల్‌లో దిగుమతులు 30 ఏళ్ల కనిష్ఠానికి పడిపోయాయి. చమురు సంక్షోభం మరియు ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ప్రజలు పొదుపు పాటించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన మరుసటి రోజే ఈ నిర్ణయం రావడం గమనార్హం.



# బలపరీక్షలో నెగ్గిన టీవీకే ప్రభుత్వం!

### ఓటింగ్‌ను బహిష్కరించిన డీఎంకే..

### మద్దతుగా అన్నాడీఎంకే రెబల్ వర్గం

**చెన్నై, మే 13:** తమిళనాడు సీఎం విజయ్ తన రాజకీయ జీవితంలో మరో కీలక మైలురాయిని అధిగమించారు. బుధవారం అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో ఆయన తన బలాన్ని నిరూపించుకుని ప్రభుత్వంపై ఉన్న నీలినీడలను తొలగించారు. మొత్తం 234 స్థానాలున్న అసెంబ్లీలో జరిగిన ఈ బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి మద్దతుగా ఓటు వేయగా, 22 మంది వ్యతిరేకించారు. టీవీకే పార్టీకి సొంతంగా 108 మంది ఎమ్మెల్యేల బలం ఉండగా, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల ఎమ్మెల్యేలు విజయ్‌కు అండగా నిలిచారు. అత్యంత ఆసక్తికరంగా, అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబల్ ఎమ్మెల్యేలు సైతం విప్‌ను ధిక్కరించి విజయ్‌కు అనుకూలంగా ఓటు వేశారు. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే ఈ ఓటింగ్‌ను బహిష్కరిస్తూ సభ నుండి వాకౌట్ చేసింది. డీఎంకేకు చెందిన 59 మంది ఎమ్మెల్యేలు సభలో లేకపోవడంతో మ్యాజిక్ మార్కు తగ్గింది, ఇది విజయ్ గెలుపును మరింత సులభతరం చేసింది. బలపరీక్షలో నెగ్గిన అనంతరం సీఎం విజయ్ సభలో ఉద్వేగభరితంగా ప్రసంగించారు. "ప్రజలను నమ్ముకునే మేము ఎన్నికల బరిలోకి దిగామని, అన్ని వర్గాల మద్దతుతో ఐదేళ్ల పాటు



సుస్థిర పాలన అందిస్తామని" ఆయన ధీమా వ్యక్తం చేశారు. లౌకిక విధానాన్ని పాటిస్తూ, మహిళల భద్రత మరియు సామాజిక న్యాయమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన పునరుద్ఘాటించారు. విమర్శలు ఎదుర్కొన్న ఓఎస్‌డీ రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్ నియామకాన్ని పునఃసమీక్షిస్తామని సానుకూల నిర్ణయం తీసుకున్నారు. విశ్వాస పరీక్ష సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ టీవీకే ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. ఇది 'రీల్ ప్రభుత్వం' అని, ఎమ్మెల్యేల కొనుగోళ్లతోనే విజయ్ గట్టెక్కారని ఆరోపించారు. అన్నాడీఎంకే అధినేత పళనిసామి కూడా తమ ఎమ్మెల్యేలకు విజయ్ డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించగా, రెబల్ వర్గం నేత వేలుమణి ఆ ఆరోపణలను తిప్పికొట్టారు. తాము ఎలాంటి పదవులను ఆశించి మద్దతు ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు.




# పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల అనివార్యం

### ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మే 13:** పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా చమురు ధరలు పెంచక తప్పదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చన్నారు. స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఎంఈ) నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగితే, ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేసే అవకాశం ఉందని గవర్నర్ అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, చమురు కంపెనీలు నష్టాలను భరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. అయితే ఇది ఎంతకాలం సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు పెరిగితే అది దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా వస్తువుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను ఉపయోగించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలను కోరారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి కేంద్రం పెంచింది. దీంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. గత కొంతకాలంగా చమురు ధరలూ పెంచుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం

### పలు అంతర్జాతీయ సర్వీసులు నిలిపివేత

**న్యూఢిల్లీ, మే 13:** ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇంధన ధరల పెరుగుదల, గగనతల ఆంక్షల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మొత్తం ఆరు ప్రధాన అంతర్జాతీయ మార్గాల్లో విమానాలను నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటన జారీ చేసింది. ఢిల్లీ-చికాగో, ముంబై-న్యూయార్క్, ఢిల్లీ-షాంఘై, చెన్నై-సింగపూర్, ముంబై-ఢాకా, ఢిల్లీ-మాలే రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయం జూన్ నుంచి ఆగస్టు మధ్యకాలంలో అమలులో ఉంటుందని తెలిపింది. నష్టాల దృష్ట్యా ఇప్పటికే కొన్ని మార్గాల్లో సర్వీసులను ఎయిర్ ఇండియా తగ్గించింది. ఆ నిర్ణయాన్ని మరికొన్ని రూట్లకు విస్తరిస్తూ తాజాగా ప్రకటన జారీ చేసింది. దీని ప్రకారం ఎయిర్ ఇండియా సంస్థ ప్రతి నెలా 1,200కు పైగా అంతర్జాతీయ విమాన సర్వీసులను నడపనుంది. వీటిలో ఉత్తర అమెరికాకు వారానికి 33, ఐరోపాకు 47, యూకేకు 57, ఆస్ట్రేలియాకు 8, ఫార్ ఈస్ట్, ఆగ్నేయాసియా, సార్క్ ప్రాంతాలకు 158 విమానాల చొప్పున నడవనున్నాయి. అలాగే మారిషస్‌కు వారానికి ఏడు విమాన సర్వీసులు ఉన్నట్లు పేర్కొంది. కాగా, నష్టాల దృష్ట్యానే ఎయిర్ ఇండియా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# ఇంటింటా జనగణన.. గజ్వేల్‌లో అధికారుల ఫోకస్

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో జనగణన మహా కార్యక్రమం
- 103 బ్లాకుల్లో 103 ఎన్యూమరేటర్లతో ఇంటింటి సర్వే.. ప్రజల వివరాల సేకరణ వేగవంతం
- అభివృద్ధి ప్రణాళికలకు కీలకంగా డేటా.. సహకరించాలని కమిషనర్ వెంకట్ గోపాల్ పిలుపు





**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జనగణన కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది. పట్టణంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించే లక్ష్యంతో మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నారు. ప్రజల జనాభా వివరాలు, కుటుంబ సమాచారం, నివాస పరిస్థితులు, జీవన ప్రమాణాలు తదితర అంశాలను సమగ్రంగా నమోదు చేస్తూ ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. జనగణనను సమర్థవంతంగా చేపట్టేందుకు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 103 బ్లాకులను ఏర్పాటు చేశారు. ప్రతి బ్లాక్ కు ఒక్కో ఎన్యూమరేటర్ చొప్పున 103 మంది ఎన్యూమరేటర్లను నియమించి ఇంటింటి సర్వే బాధ్యతలు అప్పగించారు. వీరు రోజువారీగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రతి ఇంటి వివరాలను నమోదు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల సంఖ్య, వారి వయస్సు, విద్యార్హతలు, వృత్తి, ఉపాధి, నివాస స్థితిగతులు, ప్రభుత్వ పథకాల లబ్ధి వివరాలు తదితర అంశాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ మాట్లాడుతూ.. జనగణన ద్వారా సేకరించే డేటా ఆధారంగా ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించవచ్చని తెలిపారు. రేషన్ కార్డులు, సామాజిక భద్రతా పెన్షన్లు, గృహ నిర్మాణ పథకాలు, విద్యా-ఆరోగ్య పథకాలు వంటి కార్యక్రమాల అమలులో ఈ సమాచారం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి జనగణన డేటా ఎంతో అవసరమని కమిషనర్ స్పష్టం చేశారు. త్రాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల విస్తరణ, వీధిలైట్ల ఏర్పాటు, ఆరోగ్య సేవల మెరుగుదల వంటి అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించడంలో ఈ వివరాలు ప్రధాన ఆధారంగా నిలుస్తాయని తెలిపారు. పట్టణ అవసరాలకు అనుగుణంగా నిధుల కేటాయింపులు, సౌకర్యాల కల్పన కూడా జనగణన ఆధారంగానే నిర్ణయించబడుతాయని పేర్కొన్నారు. ప్రజల సహకారం అత్యంత అవసరమని కమిషనర్ వెంకట్ గోపాల్ విజ్ఞప్తి చేశారు. ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నలకు ప్రజలు నిజమైన, స్పష్టమైన వివరాలు అందించాలని కోరారు. తప్పుడు సమాచారం వల్ల ప్రభుత్వ పథకాల అమలులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని సూచించారు. అలాగే జనగణన సిబ్బంది గుర్తింపు కార్డులతోనే ఇంటింటికి వస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారిక సిబ్బందికే వివరాలు అందించాలని సూచించారు. ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఎదురైతే మున్సిపాలిటీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. మొత్తంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ అభివృద్ధికి దోహదపడే విధంగా ఈ జనగణన కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజల పూర్తి సహకారంతో జనగణన ప్రక్రియను విజయవంతంగా ముగించాలని అధికారులు ఆకాంక్షించారు.

# ఉచిత క్రికెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి




**క్రీడలు మానసిక ఉల్లాసానిస్తాయి.. యువత డ్రగ్స్, బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి**

**గజ్వేల్ సీఐ రవికుమార్**

**నేటి సాక్షి గజ్వేల్ :** క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని గజ్వేల్ సీఐ రవికుమార్ అన్నారు. యువత డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ మైదానంలో నిర్వహిస్తున్న ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని గజ్వేల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శి బాకీ స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిర ప్రారంభ కార్యక్రమానికి సీఐ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నెల రోజుల పాటు ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణ పొందుతూ తమ ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో యువత మొబైల్ ఫోన్లకు అతిగా అలవాటు పడి శారీరకంగా, మానసికంగా సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల్లో ఫిట్‌నెస్‌పై తల్లిదండ్రులు అవగాహన పెంచాలని, వారిని క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన వేదిక లభిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. భవిష్యత్తులో గజ్వేల్ ప్రాంతం నుంచి మంచి క్రికెట్ క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతో హరిప్రసాద్, బాకీ స్వామి ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గజ్వేల్ ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని కోరారు. క్రీడలు యువతకు ఆరోగ్యంతో పాటు మంచి భవిష్యత్తును అందిస్తాయని, ముఖ్యంగా డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, మత్తు పదార్థాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాభిమానులు, యువ క్రీడాకారులు, శిక్షకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం ప్రారంభం

**మరికల్ మండల ఎంపీడీవో పృథ్వీరాజ్...**

**నేటి సాక్షి నారాయణపేట (ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని అప్పంపల్లి గ్రామంలో బుధవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసి అనంతరం గృహప్రవేశ కార్యక్రమాన్ని మరికల్ మండలం పృథ్వీరాజ్ ఆధ్వరంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హునికి అందాలి



**నేటి సాక్షి ,గజ్వేల్:** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో తుమ్మ చంద్రం కుటుంబానికి మంజూరైన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి షరీఫ్, పార్టీ సీనియర్ నాయకులు ఊడేం సారిక శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం పేదల సొంతింటి కలను నిజం చేస్తోందని తెలిపారు. ఇంటి స్థలం లేక, నివాసం లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ఇల్లు నిర్మించి ఇవ్వడం ద్వారా వారికి భద్రత, గౌరవం, స్థిరత్వం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పేదలకు ఉచిత, సబ్సిడీ రేషన్, వృద్ధాప్య పింఛన్లు, వికలాంగులు, వితంతువులకు ఆసరా పింఛన్లు, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యా సహాయం, మహిళలకు ఆర్థిక సహాయం, రైతులకు పెట్టుబడి సహాయం, రైతు బీమా పథకాలు, ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి వివాహ సహాయ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేలా అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ఇంకా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి కూడా ఇందిరమ్మ గృహ పథకం ద్వారా ఇండ్ల మంజూరు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు తుమ్మ చంద్రం దంపతులకు నాయకులు నూతన వస్త్రాలు బహూకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కుర్రే అంతిరెడ్డి, కదుల్ల రామరాజు,గుండు లక్ష్మణ్, పెరిక నాగరాజు, మహేందర్ రెడ్డి, గుండు మల్లేశం, కర్ణాకర్ రెడ్డి, ఎర్ర రాజేష్, దాకాని సాయి, డ్రైవర్ రాములు, జమాల్ పూర్ సతీష్, మామిడి సురేష్ గౌడ్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ధన్వాడలో ఇండ్ల జన గణన సర్వే

**పరిశీలించిన రాష్ట్ర ప్రత్యేక అధికారులు**



**నేటి సాక్షి నారాయణపేట, (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండలం లో జనగనన 2027 కి సంబందించిన ఇండ్లగనన (ఇండ్లకి నంబరింగ్ ఇవ్వడం) జరుగుతుంది. ఇట్టి సర్వేను బుధవారం నాడు ధన్వాడ మండల కేంద్రంలో పలు వార్డులో నిర్వహిస్తున్న జనగణన సర్వేను రాష్ట్ర డైరెక్టరేట్ అఫ్ సెంసుస్ , హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ శ్రీ లాజర్, ఎస్పై సుల్తాన్ అలీ గారు, ముఖ్య ప్రణాళిక అధికారి .ఏ.ఏం వరుణ్ సింధూజ, పర్యవేక్షన నిమిత్తం ధన్వాడ గ్రామం లో సందర్శించి ఏనుమారేటర్ లకు తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల గణాంక అధికారి నసీరుద్దీన్, మరియు సెన్సస్ సూపెర్వైసోర్ శ్రీనివాస్ సాగర్ , ఉపాధ్యాయులు, మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ దేవతల ఉత్సవాలు ఐక్యతకు నిదర్శనం

**మంత్రి వివేక్**






**నేటి సాక్షి, గజ్వేల్ :** కొండపాక మండలం కుక్కునూరు పల్లి మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం, ఎల్లమ్మ దేవత ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్ చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవతకు మొక్కులు చెల్లించి ప్రత్యేక హారతులు ఇచ్చారు. అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్ విరూపాక శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొని దేవత ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ గ్రామ దేవతల ఉత్సవాలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో ఇలాంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఎల్లమ్మ దేవతను ప్రార్థించినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో సంప్రదాయాలను కాపాడుకుంటూ ఇలాంటి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు సంప్రదాయ నృత్యాలు, భక్తి గీతాలతో ఉత్సవ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చారు.

# నయాబ్ తహసీల్దార్‌ని నియమించాలి



**నేటిసాక్షి, నల్లబెల్లి:** సుమారు రెండు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న నయాబ్ తహసిల్దార్ నియామకాన్ని చేపట్టాలని తహసిల్దార్ ముప్పు కృష్ణ కు దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దళిత రత్న పరికి రత్నం బుధవారం వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గత రెండు సంవత్సరాల నుండి మండల రెవెన్యూ కార్యాలయంలో నయాబ్ తాహసిల్దార్ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా కలెక్టర్‌కి ఈ సమస్యను పరిశీలించి నయా తహసిల్దార్‌ని వెంటనే నియమించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముచింపుల ఉపసర్పంచ్ బొట్ల దయాకర్ మాదిగ, కొయ్యడ కుమారస్వామి, మంద నరేష్, పంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే విద్యా సంవత్సరం నుండి అమ్మ ఒడి



**నేటి సాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి లాంటిది ఆ ఒడిలో ఏ బిడ్డ కూడా ఆకలితో ఉండకూడదని ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన అమ్మ ఒడి కార్యక్రమం వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన అమ్మ ఒడి కార్యక్రమం అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాకాల పరశురాం ఒక ప్రకటనలో తెలిపారు

# ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రజాప్రతినిధులు సహకరించాలి




- ఏఎస్ఓ నర్సింలు
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత సౌకర్యాలు
- గజ్వేల్‌లో ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహణ

**నేటి సాక్షి గజ్వేల్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటోందని విద్యాశాఖ ఏఎస్ఓ నర్సింలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, నిర్వహణలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐవసి కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గజ్వేల్ మండల విద్యాశాఖ అధికారి కృష్ణ నేతృత్వంలో ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎస్ఓ నర్సింలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకంటే మెరుగైన నాణ్యమైన విద్య అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేలా, వారి వ్యక్తిగత నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా బోధన కొనసాగుతున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని వివరించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ వంటి వసతులు మెరుగుపరిచే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల వైపు మళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా స్థానిక సర్పంచులు, వార్డు సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రజాప్రతినిధులు తమ వంతు సహకారం అందించి బడుల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో నియోజకవర్గంలోని వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

### జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**నేటి సాక్షి, జగిత్యాల (పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లాలోని సారంగాపూర్ మండల కేంద్రం, రేచ పెల్లి, లచ్చ నాయక్ తాండ మరియు నాగునూర్ గ్రామాల్లో పాక్స్, ఐకెపి, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ. కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో మరియు జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు గన్ని సంచులు, టార్పలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్ఫాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాలు ఉన్నందున ఉరుములు మెరుపులతో కూడుకున్న వర్షాలు కురిస్తే రైతులు చెట్ల కింద, కరెంటు పోల్స్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించాలని అన్నారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, DRDO రఘువరన్, సారంగాపూర్ మండల తహసిల్దార్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అక్కారం గ్రామంలో బాల్య వివాహానికి అడ్డుకట్ట



- అధికారుల అప్రమత్తతతో నిలిచిన వివాహం.. కుటుంబానికి అవగాహన

**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో బాల్య వివాహం జరగనున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే అధికారులు అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకొని బాల్య వివాహాన్ని అడ్డుకొని నిలిపివేశారు. అధికారుల తక్షణ చర్యలతో ఓ బాలిక భవిష్యత్తు కాపాడబడింది. సంఘటనా స్థలానికి చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ గణేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్ రజిత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు, పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ, గ్రామపంచాయతీ అధికారి తదితరులు చేరుకున్నారు. బాల్య వివాహం వల్ల కలిగే చట్టపరమైన సమస్యలు, సామాజిక దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యలపై కుటుంబ సభ్యులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. అధికారులు మాట్లాడుతూ బాలికకు 18 సంవత్సరాలు నిండకముందు, బాలుడికి 21 సంవత్సరాలు నిండకముందు వివాహం జరపడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు జరిపితే చట్టపరంగా కేసులు నమోదు అవుతాయని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా బాల్య వివాహాల వల్ల బాలికల విద్యకు అంతరాయం కలుగుతుందని, చిన్న వయసులో గర్భధారణ కారణంగా ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. బాల్య వివాహం వల్ల బాలల భవిష్యత్తు నాశనం అవుతుందని, వారి చదువు, ఎదుగుదల, ఆరోగ్యం దెబ్బతింటాయని అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను అరికట్టేందుకు బాధ్యతగా వ్యవహరించాలని, గ్రామస్థులు కూడా సహకరించాలని సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రజలే ముందుకు వచ్చి సమాచారం అందిస్తే మరిన్ని కుటుంబాలను చైతన్యపరచవచ్చని పేర్కొన్నారు. అలాగే బాలలపై ఎలాంటి ఇబ్బందులు, బాల్య వివాహాల ప్రయత్నాలు, బాలల హక్కులకు భంగం కలిగే పరిస్థితులు కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ ఘటన ద్వారా బాల్య వివాహాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. బాలల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవిస్తూ సహకరించాలని కోరారు.

# కాంగ్రెస్ తోనే సొంతింటి కళ సహకారం



**నేటిసాక్షి, నల్లబెల్లి:** ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో మండల కేంద్రంలో పేదల సొంతింటి కలను నెరవేర్చుకుంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు సాధ్యమవుతుందని నల్లబెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని మహేష్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన నాతి సువర్ణ రాజేందర్ దంపతుల ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశానికి ఆయన బుధవారం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహ యజమానులు ఆయనకు శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో పరికి త్యాగరాజు, మండల పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండి అశోక్,త్రికోవెల మురళి మాసంపల్లి ప్రభాకర్, బుస కుమారస్వామి,గాజు బిక్షపతి, నంగునూరు మల్లా చారి, బాబురావు, పోడేటి కిషోర్, పాండవుల శంకర్ లింగం, కన్నెబోయిన సురేష్, రాజు, విష్ణు, పోడేటి కిరణ్, కోదూరి సిద్ధు, యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ దండు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కాలనీలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయండి



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రములోని బీసీ కాలనీలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కలిసి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ధన్వాడ మండల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. బుధవారం ధన్వాడలో స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధన్వాడ మండల కేంద్రములో గల రహదారిపై వాహనాలు వేగంగా వస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయారని అధికారులకు వివరించి. స్థానిక మందిరం నుండి బీసీ కాలనీ వరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నారాయణపేట జిల్లా కేంద్రంలో గల ఆర్ అండ్ బి కార్యాలయానికి వెళ్ళి అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.. ఇట్టి కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గున్ముకుల మాజీ ఎంపిటీసీ డీ.సుధీర్ కుమార్ రావు,పట్టణ అధ్యక్షులు డీ.మల్లేష్ గౌడ్,వడ్ల శాంతి కుమార్, శివారెడ్డి, ఇర్ఫాన్,సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాడంపల్లిలో ఇటుక బట్టి కార్మికులకు క్షయ వ్యాధి వైద్య శిబిరం

### టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా

### జగిత్యాల జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్



**నేటి సాక్షి, జగిత్యాల (పూరెళ్ల బాపు):** టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మ్యాడంపల్లిలో ఇటుక బట్టి కార్మికులకు క్షయ వ్యాది వైద్య శిబిరము నిర్వ హించారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ క్షయ వ్యాధి బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సలహాలను సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం, తెమడలో రక్తం పడటం, చాతిలో పట్టేసినట్టు ఉండడం ఇలాంటి లక్షణాలు ఉన్నప్పుడు దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేసి తగు పరీక్షలు చేయించుకొని మందులు వాడాల్సిందిగా సూచించారు. ఈ వైద్య శిబిరంలో స్పుటం కిట్లు అందచేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భవిత సెంటర్ శంకు స్థాపన

### కాంగ్రెస్ మండల్ అధ్యక్షులు చెంద్రశేఖర్.



**నేటి సాక్షి, చౌడాపూర్(సురేష్ మోత్కూర్):** చౌడపూర్ మండల కేంద్రంలో భవిత సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్న చౌడపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాకలపల్లి శేఖర్ మాజీ అధ్యక్షులు అశోక్ కుమార్. భవిత సెంటర్ శంకుస్థాపన స్థానిక కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ. దివ్యాంగుల శిక్షణ కొరకు భవిత సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని దీనిని మండలంలోని దివ్యాంగులు అందరు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నవీన్ ఉపసర్పంచ్ రాజు మండల ముఖ్య నాయకులు ఆత్మ కమిటీ డైరెక్టర్, మండల ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, వివిధ గ్రామాల సర్పంచులు నారాయణ, రామాంజనేయులు, కొత్తపల్లి రఘు, మరికల్ శివకుమార్ మల్కాపూర్ వెంకటయ్య, చక్రపాణి రెడ్డి,యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రాము మణికంఠ, గ్రామ ముఖ్య నాయకులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ ప్రజల జీవితాలతో చెలగాటం

### ఆడితే కాంగ్రెస్ ఊరుకోదు. వర్థ్య సురేష్.



**నేటి సాక్షి, దోమ (సురేష్ మోత్కూర్):** దోమ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మాట్లాడుతూ. ప్రధాని మోదీ బంగారం రేట్లు పెంచితే ప్రజా వ్యతిరేకత వస్తాదని ఆలోచించి ఒకరోజు ముందే మీరు బంగారు కొనవద్దు అని ప్రకటించారు. ఎందుకంటే నేను రేట్లు పెంచుకుంటాను అని చెప్పి చెప్పేసినారు, ఇప్పుడు పెరిగిన కూడా ప్రజల్లో పెద్ద వ్యతిరేకరాదు. ఎందుకంటే బంగారు కొనకండి అని ముందే అన్నారు కాబట్టి రేట్లు పెంచినారులే అని జనాలు అనుకుంటారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడితే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. నిత్యవసర ధరలు మరియు బంగారం, చమురు ధరలు వెంటనే తగ్గించాలి లేకుంటే ప్రజా ఆందోళన తప్పదు మోదీనీ హెచ్చరించారు.



# మహిళల టీ20 ప్రపంచకప్‌కు ఆస్ట్రేలియా జట్టు

**మెల్‌బోర్న్, మే 13 :** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ కోసం ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు బుధవారం జట్టును ప్రకటించింది. జట్టుకు కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌండర్ సోఫీ మోలినెక్స్‌ను ఎంపిక చేయగా, వైస్ కెప్టెన్‌గా ఆష్లే గార్డ్‌నర్ బాధ్యతలు చేపట్టనున్నారు. అనుభవజ్ఞులైన ఎలీస్ పెర్రీ, బెత్ మూనీ, తాలియా మెక్‌గ్రాత్ వంటి స్టార్ ఆటగాళ్లకు కూడా జట్టులో చోటు లభించింది. ఈసారి ఇంగ్లండ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు స్పిన్ బౌలింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్పిన్నర్లు జార్జియా వేర్‌హామ్, అలానా కింగ్‌లకు జట్టులో స్థానం కల్పించారు. మరోవైపు ఫాస్ట్ బౌలర్ డార్సీ బ్రౌన్‌కు అవకాశం దక్కలేదు. ఆమె స్థానంలో 20 ఏళ్ల యువ లెఫ్ట్ ఆర్మ్ సీమర్ లూసీ హామిల్టన్‌ను ఎంపిక చేశారు. మహిళల ప్రీమియర్ లీగ్‌లో బెంగళూరు జట్టు తరఫున ఆడిన గ్రేస్ హారిస్, ఎలీస్ పెర్రీ, సోఫీ మోలినెక్స్‌లకు ప్రపంచకప్ జట్టులో చోటు దక్కడం విశేషం. జూన్ 12 నుంచి జులై 5 వరకు జరిగే ఈ టోర్నీలో గ్రూప్–1లో ఆస్ట్రేలియాతో పాటు భారత్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లు ఉన్నాయి. జూన్ 13న మాంచెస్టర్ వేదికగా దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, పాకిస్థాన్, భారత్ జట్లతో తలపడనుంది. జూన్ 28న లార్డ్స్ మైదానంలో భారత్–ఆస్ట్రేలియా మధ్య జరిగే మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆస్ట్రేలియా జట్టులో సోఫీ మోలినెక్స్, ఆష్లే గార్డ్‌నర్, తాలియా మెక్‌గ్రాత్, నికోలా క్యారీ, కిమ్ గార్త్, లూసీ హామిల్టన్, గ్రేస్ హారిస్, అలానా కింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, బెత్ మూనీ, ఎలీస్ పెర్రీ, మేగన్ షట్, అన్నబెల్ సదర్లాండ్, జార్జియా వోల్, జార్జియా వేర్‌హామ్ చోటు దక్కించుకున్నారు. రిజర్వ్ వికెట్ కీపర్‌గా తాలియా విల్సన్‌ను ఎంపిక చేశారు.

# ఐపీఎల్ పేరిట సైబర్ మోసాలు



**హైదరాబాద్, మే 13 :** దేశవ్యాప్తంగా ఐపీఎల్ జోరు కొనసాగుతున్న వేళ సైబర్ నేరగాళ్లు అభిమానులను లక్ష్యంగా చేసుకుని భారీ మోసాలకు పాల్పడుతున్నారు. నకిలీ టికెట్లు, ఉచిత ప్రత్యక్ష ప్రసారం పేరుతో వెయ్యికిపైగా నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నట్లు సైబర్ భద్రతా సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. కీలక మ్యాచ్‌ల సమయంలో టికెట్లు దొరకక ఇబ్బంది పడుతున్న అభిమానులు, ఉచిత ప్రసారం కోసం వెతుకుతున్న వారినే కేటుగాళ్లు ప్రధానంగా లక్ష్యంగా చేసుకుంటున్నట్లు తెలిపింది. నివేదిక ప్రకారం నకిలీ ఐపీఎల్ టికెట్ల విక్రయాల కోసం ఆరు వందలకు పైగా నకిలీ డొమైన్లు, ఉచిత మ్యాచ్ ప్రసారం పేరుతో మరో నాలుగు వందలకు పైగా నకిలీ వెబ్‌సైట్లు ప్రస్తుతం చురుకుగా పనిచేస్తున్నాయి. ఈ వెబ్‌సైట్లు అచ్చం అసలు సంస్థల మాదిరిగానే కనిపించేలా రూపొందిస్తున్నారని, అధికారిక గుర్తులు, రంగులు, టికెట్ బుకింగ్ విధానాలను కాపీ చేసి అభిమానులను నమ్మిస్తున్నారని పేర్కొంది. సీట్లు ఎంపిక చేసుకోమని చెప్పి వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు, బ్యాంకు సమాచారం సేకరించి అనంతరం యూపీఐ, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు లేదా క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బులు చెల్లింపులు చేయిస్తున్నట్లు వెల్లడించింది. డబ్బులు చెల్లించిన తరువాత కొందరికి నకిలీ బుకింగ్ గుర్తింపు సంఖ్యలు, నకిలీ క్యూఆర్ కోడ్‌లతో కూడిన పీడీఎఫ్ టికెట్లు కూడా పంపుతున్నారని తెలిపింది. తీరా స్టేడియం వద్దకు వెళ్లిన తరువాతే అది మోసమని బాధితులకు తెలుస్తోందని పేర్కొంది. మరోవైపు ఉచిత ప్రత్యక్ష ప్రసారం పేరుతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న లింకులు కూడా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి లింకులు తెరిచిన వెంటనే అనుమానాస్పద అనువర్తనాలు డౌన్‌లోడ్ కావడం, వ్యక్తిగత సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సైబర్ భద్రతా నిపుణులు అభిమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టికెట్లు కొనుగోలు చేసే ముందు వెబ్‌సైట్ నిజమైనదో కాదో తప్పనిసరిగా పరిశీలించాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనుమానాస్పద లింకులను తెరవొద్దని హెచ్చరించారు. కేవలం అధికారిక వేదికల ద్వారానే టికెట్లు కొనుగోలు చేయాలని, ఉచిత ప్రసారం పేరుతో వచ్చే నకిలీ వెబ్‌సైట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

# హర్భజన్ భద్రతపై హైకోర్టు ప్రశ్నలు



**చండీగఢ్, మే 13 :** భారత మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్‌కు కేటాయించిన భద్రతా సిబ్బందిపై పంజాబ్, హర్యానా హైకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. అధికారికంగా అనుమతించిన సంఖ్యకు మించి పోలీసు సిబ్బందిని ఎలా నియమించారో వివరణ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జగ్మోహన్ భన్సల్, అధికారిక రికార్డుల ప్రకారం హర్భజన్ సింగ్‌కు కేవలం ఎనిమిది మంది భద్రతా సిబ్బందికే అనుమతి ఉందని పేర్కొన్నారు. అయితే అదనంగా మరో 15 మంది పోలీసులను అనధికారికంగా విధుల్లోకి ఎలా పంపారో స్పష్టంచేయాలని ప్రశ్నించారు. జిల్లాల వారీగా భద్రతా సిబ్బంది కేటాయింపులపై లెక్కలు సమర్పించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు కోర్టు పేర్కొంది. ప్రస్తుతం అధికారికంగా, అనధికారికంగా ఎంతమంది పోలీసులు భద్రతా విధుల్లో ఉన్నారో పూర్తి వివరాలు సమర్పించాలని భద్రతా అదనపు డైరెక్టర్ జనరల్, మోఘా జిల్లా పోలీసు అధికారి కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ వివరాలపై వేర్వేరుగా అఫిడవిట్లు సమర్పించాలని కోర్టు స్పష్టం చేసింది. అలాగే పిటిషనర్‌కు లేదా ఆయన కుటుంబ సభ్యులకు ఎటువంటి హాని జరగకుండా చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది. ప్రజాధనంతో వీఐపీ భద్రత పేరిట అధిక సంఖ్యలో పోలీసులను వినియోగిస్తున్న అంశంపై కూడా కోర్టు ఆరా తీసింది. ఇక హర్భజన్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌లో తన భద్రతను అకస్మాత్తుగా తగ్గించారని, తనకు ఉన్న ముప్పును సమీక్షించకుండా నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కనీసం ముందస్తు నోటీసు కూడా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణను కోర్టు మే 20కి వాయిదా వేసింది.

# కోహ్లీ విశ్వరూపం!


**అజేయ శతకంతో చెలరేగిన విరాట్.. ■ రాయల్ ఛాలెంజర్స్ ఘనవిజయం**
**రసవత్తర పోరులో కోల్ కతాపై గెలుపు.. ■ పట్టికలో అగ్రస్థానానికి బెంగళూరు**



**రాయ్‌పూర్:** ఐపీఎల్‌లో భాగంగా షహీద్ వీర్ నారాయణ్ సింగ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్(కేకేఆర్)పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అద్భుత విజయం సాధించింది. వర్షం కారణంగా గంట ఆలస్యంగా ప్రారంభమైన ఈ రసవత్తర పోరులో బెంగళూరు 6 వికెట్ల తేడాతో కోల్‌కతాను చిత్తు చేసింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అజేయ శతకంతో చెలరేగి ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించాడు. ఈ అద్భుత విజయంతో బెంగళూరు పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో అగ్రస్థానానికి (టేబుల్ టాపర్) దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్ కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్యఛేదనలో బెంగళూరు కేవలం 19.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 194 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. బెంగళూరు బ్యాటర్లలో విరాట్ కోహ్లీ అద్భుత సెంచరీతో కదంతొక్కగా.. దేవ్ దత్ పడిక్కల్ రాణించాడు. బౌలింగ్ లో కార్తీక్ త్యాగి 3 వికెట్లు తీసి కోల్ కతాను కట్టడి చేశాడు.

### రఘువంశీ, రింకూల జోరు..

టాస్ గెలిచిన బెంగళూరు కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. వర్షం కారణంగా పిచ్ బౌలర్లకు అనుకూలిస్తుందనే అంచనాలతో ఈ నిర్ణయం తీసుకున్నాడు. అయితే మొదట బ్యాటింగ్ కు దిగిన కోల్ కతాకు యువ కెరటం అంగ్ క్రిష్ రఘువంశీ అద్భుతమైన ఆరంభాన్నిచ్చాడు. బెంగళూరు బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ మైదానం నలువైపులా షాట్లు బాదాడు. 46 బంతుల్లోనే 71 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచాడు. అతనికి తోడుగా విధ్వంసక బ్యాటర్ రింకూ సింగ్ ఆఖర్లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 29 బంతుల్లోనే అజేయంగా 49 పరుగులు బాది స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్ సైతం 24 బంతుల్లో 32 పరుగులు సాధించి చక్కటి సహకారం అందించడంతో కోల్ కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. బెంగళూరు బౌలర్లలో యువ పేసర్ కార్తీక్ త్యాగి 32 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి కోల్ కతాను కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. సునీల్ నరైన్ 31 పరుగులిచ్చి 1 వికెట్ తీశాడు.



### ఛేదనలో కింగ్ కోహ్లీ గర్జన..


193 పరుగుల క్లిష్టమైన లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరుకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. లక్ష్యం పెద్దది కావడంతో తొలి బంతి నుంచే బాధ్యతాయుతంగా ఆడుతూనే వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు తరలించాడు. కోల్ కతా బౌలర్లు వికెట్లు తీసేందుకు ప్రయత్నించినా కోహ్లీ ఏ దశలోనూ అవకాశం ఇవ్వలేదు. కేవలం 60 బంతుల్లోనే అజేయంగా 105 పరుగులు సాధించి 'ఛేజ్ మాస్టర్' అనిపించుకున్నాడు. అతనికి తోడుగా క్రీజులోకి వచ్చిన దేవ్ దత్ పడిక్కల్ సైతం అద్భుతమైన షాట్లతో అలరించాడు. 27 బంతుల్లోనే 39 పరుగులు సాధించి కోహ్లీకి చక్కటి సహకారం అందించాడు. చివర్లో జాకబ్ బెథెల్ 12 బంతుల్లో 15 పరుగులు చేయడంతో బెంగళూరు 19.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. కోల్ కతా బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 34 పరుగులిచ్చి 1 వికెట్, జోష్ హేజిల్ వుడ్ 35 పరుగులిచ్చి 1 వికెట్, రసిఖ్ సలామ్ 35 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టినా బెంగళూరు విజయాన్ని ఆపలేకపోయారు.

### అగ్రస్థానంలో రాయల్ ఛాలెంజర్స్..

ఈ సంచలన విజయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని ఆక్రమించింది. మొత్తం 12 మ్యాచ్ లు ఆడిన బెంగళూరు 8 విజయాలు, 4 పరాజయాలతో 16 పాయింట్లు సాధించి టేబుల్ టాపర్ గా నిలిచింది. రన్ రేట్ సైతం ప్లస్ 1.053 కు పెరిగింది. నిన్నటి వరకు అగ్రస్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ (16 పాయింట్లు, రన్ రేట్ ప్లస్ 0.551) మెరుగైన రన్ రేట్ కారణంగా రెండో స్థానానికి పడిపోయింది. మరోవైపు సన్ రైజర్స్ హైదరాబాద్ 14 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఈ పోరులో ఓడిన కోల్ కతా నైట్ రైడర్స్ మొత్తం 11 మ్యాచ్ ల్లో 4 విజయాలు, 6 పరాజయాలతో 9 పాయింట్లకే పరిమితమై పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. లీగ్ దశ ముగింపుకు వస్తున్న తరుణంలో అద్భుత విజయంతో బెంగళూరు ప్లే ఆఫ్స్ బెర్తును దాదాపు ఖరారు చేసుకుంది.

# సోషల్ మీడియాలో కోహ్లీ హవా

### ఆడకపోయినా ధోనీ క్రేజ్ తగ్గలేదు




**ముంబై, మే 13 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ చివరి దశకు చేరుకోవడంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారడంతో ప్రతి మ్యాచ్ నాకౌట్ పోరును తలపిస్తోంది. ఒకవైపు మైదానంలో ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనలతో అలరిస్తుంటే, మరోవైపు సోషల్ మీడియాలో అభిమానుల మధ్య చర్చలు హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం గుజరాత్ జెయింట్స్ 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, బెంగళూరు జట్టు, హైదరాబాద్ జట్లు 14 పాయింట్లతో ప్లేఆఫ్స్ బెర్త్ కోసం పోటీ పడుతున్నాయి. పంజాబ్ జట్టు కూడా 13 పాయింట్లతో రేసులో నిలిచింది. ఈ నేపథ్యంలో స్టార్ స్పోర్ట్స్ విడుదల చేసిన సోషల్ మీడియా విశ్లేషణ ఆసక్తికర చర్చకు దారితీసింది. మార్చి 28 నుంచి మే 12 వరకు దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో అత్యధికంగా చర్చించబడిన క్రికెటర్ల జాబితాలో విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. మొత్తం చర్చల్లో 44 శాతం వాటాతో కోహ్లీ సోషల్ మీడియాను శాసిస్తున్నాడు. అతని బ్యాటింగ్‌తో పాటు మైదానంలో చూపించే దూకుడు అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. అయితే ఈ జాబితాలో అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిన విషయం మహేంద్ర సింగ్ ధోనీ రెండో స్థానంలో నిలవడమే. ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా 21 శాతం చర్చలతో ధోనీ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా కొనసాగుతున్నాడు. టోర్నమెంట్ ప్రారంభానికి ముందే గాయంతో సీజన్‌కు దూరమైనప్పటికీ, అభిమానుల్లో ఆయనపై ఉన్న అభిమానమే ఈ స్థాయి క్రేజ్‌కు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. రోహిత్ శర్మ 18 శాతం చర్చలతో మూడో స్థానంలో నిలిచాడు. సంజూ శాంసన్ 10 శాతం, కేఎల్ రాహుల్ 8 శాతం చర్చలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మరోవైపు యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో సంచలన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. రాజస్థాన్ తరఫున ఆడుతున్న అతను కేవలం 36 బంతుల్లో సెంచరీ సాధించి రికార్డు సృష్టించాడు. అయినప్పటికీ సీనియర్ స్టార్ ఆటగాళ్ల భారీ అభిమాన వర్గం కారణంగా టాప్ జాబితాలో చోటు దక్కలేదు. ఇదిలా ఉండగా, ధోనీపై బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్ అవుతున్నాయి. త్వరలో ప్రారంభం కానున్న యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ధోనీ ఆడితే చూడాలని ఉందని ఆయన వ్యాఖ్యానించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# బన్నీతో మరోమారు పూజ

బుట్టబొమ్మ పూజా హెగ్డేకు అదృష్టం పట్టిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. పూజా వరుసగా అరడజను సినిమాలు డిజాస్టర్ అందుకున్నాయి. ఈ లెక్కన పూజా హెగ్డే పేరు కూడా ఎక్కడా వినిపించ కూడదు. కానీ, అదేంటో ఈ చిన్నది వరుస ఫ్లాపులను అందుకున్నా అవకాశాలు మాత్రం కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ప్రస్తుతం పూజా చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. ఇప్పటికే ఆమె నటించిన జననాయగన్ రిలీజ్ కి సిద్ధమవుతోంది. ఇది కాకుండా హిందీలో వరుణ్ ధావన్ సరసన తేరా హో జాన్ సినిమాలో పూజా నటిస్తోంది. ఇందులో అమ్మడి అందాల ఆరబోత చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. ఇక ఇప్పుడు పూజా మరో లక్కీ ఛాన్స్ ని పట్టేసిందని సమాచారం. అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెల్సిందే. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ నటిస్తోన్న రాకా శరవేగంగా షూటింగ్ జరుపుకొంటుంది. దీని తరువాత బన్నీ, మరో కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ లో ఒక సినిమా చేయనున్న విషయం తెల్సిందే. ఈ చిత్రంలో బన్నీకి జోడిగా పూజా హెగ్డే పేరును అనుకుంటున్నారట. ఇప్పటికే బన్నీతో దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురంలో లాంటి సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఈ జంట రొమాన్స్ చేయనున్నారు. త్వరలోనే లోకేష్.. పూజాను అధికారికంగా సినిమాలోకి ఆహ్వానించనున్నాడట. అయితే పూజా అదృష్టం బానే ఉన్నా.. మార్కెట్ పరంగా బన్నీకి రిస్క్ అని కొందరు చెప్పుకొస్తున్నారు.




# రెజ్లింగ్ నేపథ్యంలో పెద్ది

ప్రస్తుతం రామ్ చరణ్ అభిమానులు ఎదురుచూస్తోన్న చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుండడంతో టీమ్ ప్రచారం జోరు పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా 'పెద్ది' ఆర్ట్ డైరెక్టర్ అవినాశ్ కొల్లా ఓ ఇంటర్వ్యూలో మేకింగ్ విశేషాలు పంచుకున్నారు. ఈ సినిమా కూడా కుస్తీ (రెజ్లింగ్) నేపథ్యంలో సాగుతుంది. దీంతో ఇది బాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'దంగల్'ను గుర్తుచేయకుండా ఉండటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు 'దంగల్' సినిమా అస్సలు గుర్తుకు రాకూడదనేది మా టీం ముందున్న అతిపెద్ద సవాలు. అందుకే సెట్ వర్క్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఎక్కడా దంగల్‌ను పోలిన సెట్‌లు వేయలేదు. అలా ఉండకూడదనేదే ప్రధాన ఉద్దేశంగా పని చేశాం. ప్రేక్షకులు ఇదివరకే ఇలాంటి సెట్స్ చూశామనే భావన కలగకుండా ఉండటానికి మేము ఎన్నో ప్రయోగాలు చేశాం. 'పెద్ది'లో కొన్ని కొత్త ఆలోచనలు కూడా చేశాం' అని అవినాశ్ కొల్లా చెప్పారు. తన కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ స్క్రిప్ట్ అని, ఇలాంటి గొప్ప చిత్రానికి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని తెలిపారు. కథలోని ఎమోషన్‌ను ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా చేయడంలో తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాను రూ.300 కోట్ల భారీ బ్జడెట్‌తో రూపొందిస్తున్నారు. మే 18న దీని ట్రైలర్ విడుదల కానుంది. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రుతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో మెరవనున్నట్లు సమాచారం.






# కేన్స్‌లో అలియా మెరుపులు

కేన్స్, మే 13 : ప్రపంచ సినీ, ఫ్యాషన్ అభిమానుల దృష్టిని ఆకర్షించే ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివియేరా వేదికగా జరిగిన ఈ వేడుకలో ఉదయం నుంచే కలల ప్రపంచాన్ని తలపించే అందంతో కనిపించిన అలియా.. సాయంత్రం రెడ్ కార్పెట్‌పై మరింత గ్లామ-రస్‌గా మెరిసి అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించారు. లోరియల్ పారిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా కేన్స్ రెడ్ కార్పెట్‌పై అడుగుపెట్టిన అలియా.. ప్రముఖ డిజైనర్ తమారా రాల్ఫ్ రూపొందించిన ప్రత్యేక గౌన్‌లో కనిపించారు. లేత గులాబీ రంగులో రూపొందించిన ఈ స్ట్రాప్‌లెస్ గౌన్ ఆమెకు అద్భుతమైన ఆకర్షణను తీసుకొచ్చింది. ఈ గౌన్‌లో ప్రత్యేకంగా రూపొందించిన నెక్‌లైన్, కార్సెట్ శైలిలో ఉన్న బాడిస్ ఆమె ఫిట్‌నెస్‌ను మరింత హైలైట్ చేశాయి. అలాగే చేతుల చుట్టూ దుపట్టా తరహాలో అమర్చిన డ్రేప్ మొత్తం లుక్‌కు భారతీయ శైలిని జోడించింది. పాశ్చాత్య ఫ్యాషన్‌లో భారతీయతను మేళవించిన ఈ డిజైన్ ఫ్యాషన్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. అలియా మినిమల్ ఆభరణాలు, సాఫ్ట్ మేకప్, సాధారణ హెయిర్ స్టైల్‌తో ఎంతో రాయల్‌గా కనిపించారు. ఆమె చిరునవ్వు, ఆత్మవిశ్వాసం మొత్తం లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. ప్రస్తుతం కేన్స్‌లో అలియా చేసిన ఈ స్టైల్ స్టేట్‌మెంట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అభిమానులతో పాటు ఫ్యాషన్ విమర్శకులు కూడా అలియా లుక్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. భారతీయ సాంప్రదాయాన్ని ఆధునిక ఫ్యాషన్‌తో మేళవిస్తూ అలియా మరోసారి గ్లోబల్ ఫ్యాషన్ ఐకాన్‌గా తన స్థాయిని నిరూపించుకున్నారని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

గత కొన్నేళ్లుగా కేన్స్ వేదికపై భారతీయ నటీమణులు తమ ప్రత్యేక ఫ్యాషన్ స్టైల్స్‌తో ఆకట్టుకుంటుండగా.. ఈసారి అలియా భట్ తన సొగసైన రెడ్ కార్పెట్ లుక్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ప్రస్తుతం ఆమె ఫోటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

# రొమాంటిక్ లుక్స్‌తో ఎస్తర్ అనిల్

**హైదరాబాద్, మే 13 :** బాలనటిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించి, ఇప్పుడు కథానాయికగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి ఎస్తర్ అనిల్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె పంచుకున్న ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటూ వైరల్ అవుతున్నాయి. స్టైలిష్ మరియు రొమాంటిక్ లుక్స్‌లో కనిపించిన ఎస్తర్ అనిల్ ఫోటోలకు నెటిజన్ల నుంచి భారీ స్పందన వస్తోంది. మలయాళం, తెలుగు, తమిళ భాషల్లో నటిగా మంచి గుర్తింపు సంపాదించిన ఎస్తర్ అనిల్, ముఖ్యంగా 'దృశ్యం' సిరీస్ ద్వారా ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన మలయాళ 'దృశ్యం' చిత్రంలో అనుమోల్ పాత్రలో నటించిన ఆమె, ఆ తర్వాత అదే పాత్రను తెలుగు రీమేక్‌లో వెంకటేష్ కుమార్తెగా పోషించి తెలుగు ప్రేక్షకుల మన్ననలు పొందారు. కుటుంబ భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న ఆ సినిమాలో ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ఎస్తర్ అనిల్ 2010లో విడుదలైన 'నల్లవన్' చిత్రంతో బాలనటిగా సినీ రంగ ప్రవేశం చేశారు. అనంతరం 'దృశ్యం', 'దృశ్యం 2', తమిళంలో 'పాపనాసం' వంటి చిత్రాలతో దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. చిన్న వయసులోనే సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమెకు అనేక అవకాశాలు వచ్చాయి. ఇక హీరోయిన్‌గా కూడా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఎస్తర్, 'జోహార్' వంటి చిత్రాల్లో ప్రధాన పాత్రల్లో నటించారు. నటనలో ప్రతిభ కనబరిచిన ఆమెకు 2016లో ఉత్తమ బాలనటిగా కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డు లభించింది. ప్రస్తుతం లండన్‌లో మాస్టర్స్ చదువుతూనే సినిమాల్లో నటిస్తూ విద్య, కెరీర్‌ను సమతుల్యం చేసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు యాక్టివ్‌గా ఉండే ఎస్తర్ అనిల్, తన కొత్త ఫోటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటుంటారు. తాజాగా విడుదల చేసిన రొమాంటిక్ స్టైల్ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా, అభిమానులు ఆమె అందం, స్టైల్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# అరుంధతితో స్టార్‌డమ్

## అనుష్క ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, మే 13 : దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన నటీమణుల్లో అనుష్క శెట్టి ఒకరు. గ్లామర్ పాత్రలతో పాటు కథానాయిక ప్రాధాన్య చిత్రాల్లోనూ తనదైన ముద్ర వేసిన ఆమె, పాన్ ఇండియా స్థాయిలో అభిమానులను సంపాదించుకున్నారు. 'సూపర్' సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన అనుష్క, తర్వాత వచ్చిన 'అరుంధతి' చిత్రంతో ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారిపోయారు. అనంతరం 'బాహుబలి' సిరీస్‌తో దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు పొందారు. అసలు పేరు స్వీటి శెట్టి అయిన అనుష్కకు సినీ రంగంలోకి వచ్చిన తర్వాత దర్శకుడు పూరి జగన్నాథ్, హీరో నాగార్జున కలిసి "అనుష్క" అనే పేరును పెట్టినట్లు తెలిసిందే. సినిమాల్లోకి రాకముందు ఆమె యోగా శిక్షకురాలిగా పనిచేశారు. 2005లో విడుదలైన 'సూపర్' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన అనుష్క, ఆ తర్వాత దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన 'విక్రమార్కుడు' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే 2009లో విడుదలైన 'అరుంధతి' చిత్రం ఆమె కెరీర్‌కు కీలక మలుపు తిప్పింది. దర్శకుడు కోడి రామకృష్ణ రూపొందించిన ఈ ఫాంటసీ చిత్రంలో జేజమ్మ పాత్రలో అనుష్క నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమాకు గాను ఆమెకు నంది స్పెషల్ జ్యూరీ అవార్డు, ఫిలింఫేర్ ఉత్తమ నటి పురస్కారాలు దక్కాయి. అనంతరం 'రుద్రమదేవి', 'భాగమతి' వంటి మహిళా ప్రాధాన్య చిత్రాలతో తన ఇమేజ్‌ను మరింత బలోపేతం చేసుకున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ పాత ఇంటర్వ్యూలో అనుష్క తన వ్యక్తిగత జీవితం, సహచర నటీనటుల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తనకు ఇష్టమైన హీరోయిన్లలో త్రిష, నయనతార ఉన్నారని తెలిపారు. అలాగే నటి భూమిక చావ్లాను కుటుంబ సభ్యురాలిలా భావిస్తానని చెప్పారు. హీరోల విషయానికి వస్తే, నాగార్జున చాలా పాజిటివ్ వ్యక్తి అని, సుమంత్తో కలిసి పని చేయడం ఎంతో సౌకర్యంగా అనిపిస్తుందని పేర్కొన్నారు. తన వ్యక్తిగత బలహీనత గురించి మాట్లాడుతూ, ఫోన్‌ను తరచుగా సైలెంట్‌లో పెట్టడం వల్ల చాలాసార్లు అందుబాటులో ఉండనని, అదే తనపై ఎక్కువగా వచ్చే ఫిర్యాదని నవ్వుతూ చెప్పారు. తన జీవితంలో వచ్చిన తొలి ప్రేమ ప్రతిపాదన గురించి కూడా అనుష్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆరో తరగతిలో చదువుతున్న సమయంలో ఒక సహాధ్యాయి "నువ్వంటే నాకు ఇష్టం" అని చెప్పాడని, దానికి తాను కూడా "ఓకే" అని సమాధానం ఇచ్చినట్లు సరదాగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం సినిమాలకు కొంత దూరంగా ఉన్నప్పటికీ, అనుష్కకు ఉన్న క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.



Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# శంకర్‌పల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం

**ప్రిన్సిపాల్ శోభారాణి**

**నేటి సాక్షి,శంకర్‌పల్లి:** తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో 2026- 2027 సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుండి 25 వ తేదీ వరకు అడ్మిషన్స్ కొరకై ఇచ్చట ఇవ్వబడిన సైట్లో ఎంపీసీ, బైపీసీ, సిఇసి, ఏసిఈ గ్రూపుల కొరకు ఆన్లైన్‌లో (http...tgms.telangana.gov.in) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.




# రాష్ట్ర స్థాయి పోటీల్లో ధర్మారం విద్యార్థినికి కాంస్య పతకం



**నేటి సాక్షి, ధర్మారం:** ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న తుమ్మల మనోజ్ఞ అండర్-16 హై జంప్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడో స్థానం సాధించి కాంస్య పథకాన్ని గెలుచుకున్నదని బుధవారం ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ తెలిపారు. ఈనెల 10వ తేదీన హనుమకొండ జిల్లాలో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జంప్స్ మరియు త్రోస్ పోటీల్లో పాల్గొన్న తుమ్మల మనోజ్ఞ అండర్-16 విభాగంలో హై జంప్‌లో ప్రతిభ కనబరిచి మూడో స్థానాన్ని సాధించి కాంస్య పథకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినిని ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమరయ్య, మేకల సంజీవరావు, విద్యార్థిని తల్లిదండ్రులు అభినందించారు.

# ఫతేపురంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన చైర్మన్ ప్రవీణ్ కుమార్



**నేటి సాక్షి, శంకర్ పల్లి;** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫతేపురం 8వ వార్డులో బుధవారం షాబాద్ మానెమ్మ, టంగుటూరి తులసి ఇందిరమ్మఇండ్లను స్థానిక మునిసిపాలిటీ చైర్ పర్సన్ ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభమవుతుందని తెలిపారు. ఇల్లు లేని వారికి ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి , మున్సిపల్ కమిషనర్ యోగేష్, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పీచరి అఖిల యాదవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేడిపల్లి యాదయ్య గౌడ్, సు క్క రెడ్డి, ఈ. బాలకృష్ణ రెడ్డి ఎస్. రాజశేఖర్ రెడ్డి, జి. మహిపాల్ రెడ్డి, ఎస్. సంజీవ, రాజేష్, సిహెచ్. పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధిత రాజస్థాన్ కార్మికులకు పరామర్శ

**ఆర్థిక సాయం**



**నేటి సాక్షి:** మంత్రాలయం మఠం క్వార్టర్స్ సమీపంలో సిలిండర్లు పేలి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన రాజస్థాన్ కార్మికులను ఎంపీటీసీ మేకల వెంకటేశు, సీఐ దస్తగిరి బాబు, ఎస్ఐ మల్లికార్జున పరామర్శించారు. ప్రమాదంలో షెడ్లు పూర్తిగా దగ్ధమై నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు తక్షణ ఉపశమనంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు.

# రైతు వద్దకు శాస్త్రవేత్తలు




- రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రవేత్తల బృందాలు ఏప్రిల్ 27 నుండి మే 23 వరకు .
- రైతు వద్దకు శాస్త్రవేత్తలు' కార్యక్రమం ద్వారా రైతులకు సేవలు అందిస్తారు .
- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీయూ) తెలంగాణ వ్యవసాయ శాఖ సూచనలు.

**నేటి సాక్షి ,చిలుకూరు :** సూర్యాపేట జిల్లా, చిలుకూరు మండల కేంద్రంలో రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ పి. రాజనీకాంత్, డాక్టర్ ఎస్. శ్రీనివాస్ నేతృత్వంలో 'రైతు వానాకాలం సీజన్‌కు ముందు రైతులు విత్తన రకాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మరియు రసాయన ఎరువుల (ముఖ్యంగా యూరియా) మితిమీరిన వాడకం వల్ల నేల సారం తగ్గిపోతుందని, దీనివల్ల కలిగే అనర్థాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. రసాయన పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన వరి వంగడాలు, సేంద్రియ వ్యవసాయం, పంట మార్పిడిపై శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకుంటూ, పంటల సాగును ప్లాన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు చంద్ర శేఖర్, శిరీష, వసీమ రైతులు పాల్గొని శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చించారు.

# గజ్వేల్‌లో పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



**1020 మంది హాజరు**

**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1020 మంది విద్యార్థులు, విద్యార్థినులు పరీక్షకు హాజరయ్యారు. పాలిటెక్నిక్ కళాశాల పరీక్ష కేంద్రంలో 120 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 400 మంది, డిగ్రీ కళాశాలలో 500 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాశారు. కాగా పరీక్షకు నమోదు చేసుకున్న వారిలో 20 మంది విద్యార్థులు, 21 మంది విద్యార్థినిలు గైర్హాజరైనట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష సజావుగా సాగిందన్నారు. విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకొని పరీక్ష రాయడంతో నిర్వహణ పూర్తిగా క్రమబద్ధంగా జరిగినట్లు పేర్కొన్నారు.

# రోడ్లపై పశువుల సంచారం..

**ప్రమాదాలకు కారణం ప్రజల భద్రతకు వెల్గటూర్ పోలీసుల సూచన**

**నేటి సాక్షి, ఎండపల్లి:** వెల్గటూర్, ఎండపల్లి మండల పరిధిలో రాత్రి వేళ యజమానులు లేకుండా రోడ్లపై సంచరిస్తున్న ఆవులు, ఎద్దులు, బర్రెల వంటి పశువుల కారణంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని వెల్గటూర్ ఎస్సై పి. ఉదయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన రహదారులు, గ్రామీణ రోడ్లపై పశువులు అకస్మాత్తుగా సంచరించడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవడంతో పాటు ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా పశువుల యజమానులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రాత్రి సమయంలో తమ పశువులను తప్పనిసరిగా ఇళ్ల వద్ద లేదా భద్రమైన ప్రదేశాల్లో కట్టివేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లపై లేదా ఖాళీ స్థలాల్లో వదిలివేయరాదని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా బయట సంచరిస్తున్న పశువులు గుర్తించిన పక్షంలో వాటిని "స్ట్రే అనిమల్స్"గా గుర్తించి గ్రామపంచాయతీ అధికారుల సహకారంతో ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే చర్యలు చేపడతామని హెచ్చరించారు. పశువుల యజమానులు ప్రజా భద్రతను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.




# విశ్రాంతి అటెండర్ కొత్తగట్టు మల్లేశంకు, బియ్యం అందజేత



**నేటి సాక్షి గన్నేరువరం, ( బుర్ర అంజయ్య గౌడ్):** మండలంలోని మాదాపూర్ గ్రామంలో కొత్త గట్టు మల్లేశం మృతుని కుటుంబానికి బియ్యం అందజేత గత కొన్ని సంవత్సరాలుగా అటెండర్ గా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలవల్ల మృతి చెందిన అటెండర్ కొత్తగట్టు మల్లేశం కుటుంబానికి బియ్యం అందజేసిన మాదాపూర్ సర్పంచ్ మాదర్ శ్రీనివాస్ ఎన్నికల వాగ్దానం మేరకు మాదాపూర్ మృతి చెందిన వ్యక్తి యొక్క కుటుంబం సభ్యులు వస్తున్న యువ సర్పంచ్ మాదర్ శ్రీనివాస్ అటెండర్ గా గన్నేరువరం ప్రభుత్వ పాఠశాలలో రిటైరై పొందిన వారు గత కొంతకాలంగా అనారోగ్యంతో మాదాపూర్ గ్రామంలోని ఇటీవల పది రోజుల క్రితం మృతి చెందడం జరిగింది వారికి మృతికి ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తూ తాను ఎలక్షన్లో ఇచ్చిన మాట ప్రకారం మృతి చెందిన కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం బుధవారం నాడు తన గ్రామంలో అందుబాటులో లేకున్నా తన మిత్రులు మరియు స్నేహితుల ద్వారా అందజేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో మాడుగుల కర్ణాకర్ రెడ్డి కత్తి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొడుగు స్వామి యాదవ్ ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు కన్నం మనోజ్ కొరివి అజయ్ ఫెరోజ్ అనిల్ కొత్తగట్టు ఆంజనేయులు మరియు మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# దళిత క్రైస్తవుల రాజకీయ చైతన్య సభను విజయవంతం చేయాలి

**బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుడిపి సామేలు**



**నేటి సాక్షి:** మంత్రాలయం దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించనున్న రాజకీయ చైతన్య సభను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుడిపి సామేలు పిలుపునిచ్చారు. బుధవారం మంత్రాలయంలో ఆయన మాట్లాడుతూ, దళిత క్రైస్తవులకు ప్రస్తుతం అమల్లో ఉన్న ఎస్సీ హోదాను కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల సామాజిక, రాజకీయ హక్కుల సాధన కోసం గురువారం బీఎస్పీ ఆధ్వర్యంలో మంత్రాలయంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. అందువల్ల దళిత క్రైస్తవులు, దళిత ప్రజా సంఘాల నాయకులు, యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# జనగణనలో BC గణన చేయాలి

**పరిగి బీసీ నాయకులు.**

**నేటి సాక్షి, పరిగి (సురేష్ మోత్కూర్):** పరిగి శ్రీకృష్ణ హోటల్ యందు జరిగిన మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి మరియు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ హనుమంతు ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్ కృష్ణ, పరిగి నియోజకవర్గం బిసి జేఏసీ అధ్యక్షులు సదానందం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ అడ్వకేట్ పీర్ మహమూద్ మాట్లాడుతూ ఇటీవల ప్రారంభమైన జనగణనలో వెనుకబడిన తరగతుల (Backward Classes . B.C.) జనాభాను లెక్కించకపోవడం పట్ల బి.సి. జేఏసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. రాబోయే జనగణనలో తప్పనిసరిగా బి.సి.ల జనాభా లెక్కింపు చేపట్టాలని మా సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.బి.సి.ల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులను సమగ్రంగా అంచనా వేయాలంటే కుల ఆధారిత జనగణన అత్యంత అవసరం. సరైన గణాంకాలు ఉంటేనే ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుంది.అదేవిధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బి.సి.లకు 42% రిజర్వేషన్లు ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని కూడా మా ప్రధాన డిమాండ్. బి.సి.లకు వారి జనాభా ప్రాతిపదికన తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతో అవసరం.అందువల్ల కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని, రాబోయే జనగణనలో బి.సి. జనాభా లెక్కింపును దీష లు ఎంత ఉంటే అంత రిజర్వేషన్ కల్పించాలి మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% బి.సి. రిజర్వేషన్ల అమలును వెంటనే చేపట్టాలని బి.సి. జేఏసీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నామ.ఈ కార్యక్రమంలోకాలాపూర్ సర్పంచ్ పులేందర్, బీసీ నాయకులు సుల్తాన్పూర్ వెంకటయ్య, ఎక్స్ సర్వీస్ మెన్ లింగమయ్య, వెంకటేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# విదేశీ ఉద్యోగాలకు 'టామ్‌కామ్'తో చక్కని అవకాశం

**మంత్రి వివేక్ వెంకటస్వామి**

**మందమర్రిలో జూన్ 10 నుంచి జాబ్ ట్రైనింగ్ తరగతులు ప్రారంభం**



**నేటి సాక్షి మంచిర్యాల్( శ్రీధర్ దమ్ము ):** నైపుణ్యాభివృద్ధి, భాషా శిక్షణ మరియు వృత్తిపరమైన శిక్షణ ద్వారా స్థానిక యువతకు ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పించడం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. జర్మనీలో ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు జూన్ 10, 2026 నుంచి ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. బుధవారం మంచిర్యాల జిల్లా మందమర్రిలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన జర్మనీ జాబ్ ట్రైనింగ్ క్యాంప్‌లో మంత్రి పాల్గొని మాట్లాడారు. నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టామ్‌కామ్‌కు అవసరమైన మౌలిక వసతులు, శిక్షకులు మరియు తగిన బడ్జెట్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విదేశీ ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న యువతతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఐటీఐ, ఏటీసీ మరియు అప్రెంటిస్‌షిప్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. జర్మనీ మాత్రమే కాకుండా ఇజ్రాయెల్, గ్రీస్, జపాన్ వంటి దేశాల్లో కూడా నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. "ఇటీవల తెలంగాణకు చెందిన యువతలో ఒక బృందం ఇజ్రాయెల్‌లో నిర్మాణ రంగానికి సంబంధించిన ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించింది. వారికి త్వరలోనే ఆకర్షణీయమైన వేతనాలతో అక్కడ ఉద్యోగాలు కల్పించబడతాయి" అని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో టామ్‌కామ్‌కు సమృద్ధిగా నిధులు కేటాయించారని, దీంతో సంస్థ పెద్ద ఎత్తున శిక్షణ మరియు నియామక కార్యక్రమాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. తన జర్మనీ పర్యటన సందర్భంగా అక్కడ ఉద్యోగాల్లో ఉన్న తెలంగాణ యువతను కలుసుకుని వారి పని పరిస్థితులు, అనుభవాలు మరియు ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నానని డా. వివేక్ వెంకటస్వామి చెప్పారు. మేసన్రీ, ఫార్మసీ, హాస్పిటాలిటీతో పాటు పలు సాంకేతిక రంగాల్లో ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉందన్నారు. విదేశీ ఉద్యోగాల కోసం ప్రైవేట్ ఏజెన్సీల కంటే టామ్‌కామ్‌ను ఆశ్రయించాలని విద్యావంతులైన యువతకు మంత్రి సూచించారు. ఉద్యోగ అవకాశాలు నిర్ధారించిన తర్వాత మాత్రమే టామ్‌కామ్ అభ్యర్థులను విదేశాలకు పంపుతుందని ఆయన స్పష్టం చేశారు. జర్మన్ భాషపై పట్టు సాధిస్తే జర్మనీలో ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడతాయని, అందుకోసం టామ్‌కామ్ ప్రత్యేక జర్మన్ భాషా శిక్షణను కూడా అందిస్తున్నదని తెలిపారు. ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ, పీజీ వరకు విద్యార్హతలు కలిగిన యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.

# కళాశాల అభివృద్ధిలో.. ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి



- **కెఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భీమార్జున రెడ్డి**

**నేటిసాక్షి, మిర్యాలగూడ:** కెఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బలోపేతం చేయడానికి ప్రజాప్రతినిధులు తమకు తోడ్పాటు అందించాలని కెఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భీమార్జున రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యా వారోత్సవంలో భాగంగా మూడవరోజు బుధవారం నిర్వహించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలు మరియు స్థానిక ప్రజా ప్రతినిధుల ఇంటరాక్షన్ కార్యక్రమానికి ప్రిన్సిపల్ భీమార్జున రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కళాశాలలోని మౌలిక సదుపాయాల గురించి, ఆధునిక ప్రయోగశాలల గురించి, అధ్యాపక బృందం గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి, కళాశాలలో చేరికలను పెంచడానికి తమతో కలిసి రావాలని స్థానిక ప్రజా ప్రతినిధులను కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నిలయమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ విద్యా సంవత్సరం కూడా కళాశాల నుండి వివిధ సెంట్రల్, స్టేట్ యూనివర్సిటీలో విద్యార్థులు సీట్లు సాధించే విధంగా తాము ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నామని, తద్వారా రాబోయే విద్యా సంవత్సరంలో మరిన్ని సెంట్రల్, స్టేట్ యూనివర్సిటీలలో ర్యాంకులను సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేసారు. నూకల చారిటబుల్ ట్రస్ట్ వారు కళాశాలలో పేద విద్యార్థులకు ఫీజుల విషయంలోను, అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాన్ని ఇవ్వడానికి ముందుకు రావడాన్ని స్వాగతిస్తూ నూకల వేణుగోపాల్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నూకల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నూకల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, కళాశాలలో ఉన్న పేద విద్యార్థులకు మరియు అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రోత్సాహకాలు తమ ట్రస్టు ద్వారా అందిస్తామని ప్రిన్సిపాల్ కు హామీ ఇచ్చారు. కళాశాల పూర్వపు ఉద్యోగిని, పూర్వ విద్యార్థిని మరియు ప్రస్తుత మిర్యాలగూడ పట్టణ కౌన్సిలర్ అయిన నూకల కవితా వేణుగోపాల్ రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ విద్యా వారోత్సవాలను గొప్పగా నిర్వహిస్తున్నందుకు కళాశాల ప్రిన్సిపాల్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ, కెఎన్‌ఎం కళాశాల గొప్ప చరిత్ర కలిగిన కళాశాల అని, కళాశాల పూర్వ విద్యార్థులు సమాజంలో గొప్ప గొప్ప పదవులలో ఉన్నారని, ఇప్పుడు కళాశాల రూపు రేఖలు యూనివర్సిటీ ని తలపించే విధంగా ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కెఎన్‌ఎం కళాశాల నుంచి సెంట్రల్, స్టేట్ యూనివర్సిటీలలో అడ్మిషన్లు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కళాశాల సీనియర్ అద్యాపకులు త్రాసు వెంకటరమణ, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ పి. నాగరాజు, ఫిజికల్ డైరెక్టర్ డా. పి. రవీందర్, ఎన్.సి.సి. సిటిఓ డా. గుమ్మడి నరేష్, , మ్యాథమెటిక్స్ అధ్యాపకురాలు నాగరేఖా రాణి, కళాశాల సీనియర్ అసిస్టెంట్ అరుంధతి, తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మోదీ పాలనలో కార్పొరేట్లకే లాభం

## సామాన్యులపై పన్నుల భారం మాజీ ఎమ్మెల్యే జూలకంటి




**నేటిసాక్షి, మిర్యాలగూడ:** మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో సామాన్య మధ్య తరగతి ప్రజల ఆదాయాలు తగ్గిపోతున్నాయని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగన్న అన్నారు. నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండలంలో సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగన్న మాట్లాడుతూ, నేడు ప్రజలపై పన్నుల భారం పెరుగుతున్నాయని, కార్పొరేట్ల పెట్టుబడులు లాభాలు విపరీతంగా దేశంలో పెరుగుతున్నాయని, ఇటు సామాన్య ప్రజలపై మోయలేని విధంగా అన్ని వస్తువుల పైన అడ్డు అదుపు లేకుండా పన్నుల భారాలు వేస్తున్నారని, అప్పుల మీద అప్పులు దేశ ప్రజలను కుదువపెట్టి అప్పు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను ధారధత్తం చేస్తూ, నిర్ణయం తీసుకుంటున్నారని, ప్రజలకు అవసరమైన మౌలిక సమస్యలపై పూర్తిగా వదిలేస్తూ, రైతులకు కార్మికులకు వ్యతిరేక నల్ల చట్టాలను అమలు చేయడానికి పూనుకుంటున్నారని, ఇవన్నీ చేస్తూ నీతి బోధనలు చేయడం దయ్యాలు వేదాలు వర్ణించినట్లు ఉన్నాయని, డీజిల్ పెట్రోల్ వాడకం తగ్గించడం అనే సూక్తులు చెప్పే మోదీ ఆయన మాత్రం రోడ్ షో నా పేరుతో విపరీతంగా వాహనాలను వాడుతూ, ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని, మోడీ ప్రభుత్వం అందించే సహకారంతోనే నేడు దేశంలోనే అంబానీ అదానీ సంపద రోజురోజుకు పెరగడం వాస్తవం కాదా అని ఆరోపించారు. మోడీ యొక్క అసమర్ధమైన పాలన తోనే ఇవాళ దేశంలోనే సామాన్య ప్రజలకు కావాల్సి నిత్యావసర వస్తువులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ఎరువులు ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని, దేశంలోనే అన్ని వర్గాల ప్రజలు ఆలోచన చేస్తా ఉన్నారు రా నన్ను కాలంలో మీ ప్రభుత్వాన్ని తగిన గుణపాఠం చెప్పక తప్పదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్, సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా నాయకులు రవి నాయక్ మండల కార్యదర్శి మాలోతు వినోద్ నాయక్, కమిటీ సభ్యులు దయానంద్, కరీం మునిషా తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి



**నేటి సాక్షి,చౌడేపల్లి :** గ్రామీణ ప్రాంత ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకి దూరంగా ఉండాలని ఎస్సై చిన్న రెడ్డప్ప అన్నారు ,బుధవారం మండలంలోని పంచాయతీ కేంద్రం శెట్టి పేటలో జరుగుతున్న జాతరలో భాగంగా ఆయన గ్రామాన్ని సందర్శించారు, గ్రామంలో జాతర సందర్భంగా ఎలాంటి గొడవలు చేసుకోరాదన్నారు ,మత్తు పానీయాలు పదార్థాలు స్వీకరించరాదన్నారు ,ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు, అనంతరం పలమనేరు చౌడేపల్లి రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు,

# కొత్త జంటకు కొప్పుల ఆశీర్వాదం



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండల పరిధి రాజారాంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యులు గాజుల మల్లేశం సోదరుడి కుమారుడు అరవింద్-సుమశ్రీల వివాహం ఇటీవల ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం వధూవరుల నివాసానికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. వారికి శుభాకాంక్షలు తెలియజేసి, దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి వెంట పార్టీ మండల అధ్యక్షులు సింహాచలం జగన్, శానబండ సర్పంచ్ గాదం భాస్కర్, ఎండపల్లి మాజీ సర్పంచ్ మారం జలేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మెరుగు జానీ, ఉద్యమకారుడు పడిదం వెంకటేష్, సీనియర్ నాయకులు ముక్తి చందు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గిరి కుటుంబాన్ని ఆదుకున్న టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ఇటీవల గుండెపోటుతో మరణించిన పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల లెక్చరర్ గొడుగు గోవర్దన్ గిరి మరణాంతరం అతని కుటుంబాన్ని ఆదుకొనుటకు నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కళాశాల సిబ్బంది నుంచి రూ. 2,57,600లను, స్టేట్ గెస్ట్ యూనియన్ నుంచి రూ. 50వేలు లను సేకరించి, మొత్తం రూ. 3,07,600 లను నివేష్ ప్లస్ పాలసీ ద్వారా అతని కూతురు గొడుగు సాయి, రాఘవి పేరు మీద ఫిక్స్ డ్ డిపాజిట్ చెసినట్లు తెలిపారు. గొడుగు గోవర్ధనగిరి కుటుంబాన్ని సర్జరీ సమయంలో మరియు మరణాంతరం ఆదుకున్న బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పలువురిని పరమర్శించినా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**నేటి సాక్షి,బుగ్గారం:** బుధవారం బుగ్గారం మండలకేంద్రంలోనక్క జితేందర్ బి ఆర్ ఎస్ మాజీ మండల ఎస్ సి సెల్ అధ్యక్షుడు వారి అమ్మ నక్క మల్లవ్వ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు మరియు ఇటీవలే మరణించిన కప్పల పెద్ద గంగారం ,రామగిరి లక్ష్మణ్ కుటుంబాలను కూడా పరామర్శించారు వీరితో బి ఆర్ ఎస్ నాయకులు పార్టీ కార్యకర్తలుఉన్నారు

TGTEL/25/A1737 | NETI SAKSHI

# వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకు తెలంగాణ రైతు ఐక్య వేదిక వినతి
- కొనుగోలు కేంద్రాల్లో జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన



**నేటి సాక్షి, హైదరాబాద్,జగిత్యాల:** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని వెంటనే నివారించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

### కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలు

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, లారీలు, హమాలీల కొరత తీవ్రంగా ఉందని శేర్ నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని, రైతులు ధాన్యం రాశుల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు.రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు ఆలస్యం కారణంగా వర్షాలకు తడిసి నష్టపోతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికారులకు తక్షణమే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి కొనుగోళ్లను వేగవంతం చేయాలని మంత్రిని కోరారు.

### తక్‌పట్టి రసీదు తప్పనిసరి చేయాలి

కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తూకం వేసిన వెంటనే రైతులకు తక్‌పట్టి కొనుగోలు రసీదును అక్కడికక్కడే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు. కొన్ని చోట్ల రసీదులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీనివల్ల రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు.అలాగే జిల్లావ్యాప్తంగా కొంతమంది రైస్ మిల్లర్లు "తాలు" పేరుతో అధిక తరుగు తీస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రైతులను మోసం చేస్తున్న మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

### అకాల వర్షాలతో రైతుల ఆవేదన

ఇటీవల జగిత్యాల జిల్లాలో కురిసిన అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన వరి ధాన్యం తడిసి, రంగు మారిపోయిందని శేర్ నర్సారెడ్డి తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని, తరుగు లేకుండా రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు అధికార యంత్రాంగానికి తక్షణ ఆదేశాలు జారీ చేసి జగిత్యాల జిల్లా రైతులను ఆదుకోవాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు.

### రైతులకు అండగా ఉంటాం : మంత్రి తుమ్మల

రైతుల సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తగిన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంపై దృష్టి సారిస్తామని మంత్రి పేర్కొన్నట్లు వెల్లడించారు.

# డ్రైనేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

- 22వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్
- ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని వెల్లడి



**నేటి సాక్షి కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని 22వ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యలకు త్వరలోనే ఉపశమనం లభించనుంది. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ప్రత్యేక చొరవ తీసుకుని నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక కౌన్సిలర్ టేకుల శిరీష నరేష్ వినతి మేరకు స్పందించిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ షాహిద్‌తో కలిసి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

### ప్రజల ఇబ్బందులపై వెంటనే స్పందన

22వ వార్డులో చాలాకాలంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు మున్సిపల్ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానిక కౌన్సిలర్ టేకుల శిరీష నరేష్ మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌కు వివరించారు. సమస్య తీవ్రతను గుర్తించిన చైర్‌పర్సన్ వెంటనే స్పందించి డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

### భూమి పూజతో పనుల ప్రారంభం

మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్, స్థానిక వార్డు కౌన్సిలర్ టేకుల శిరీష నరేష్ కలిసి నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ప్రజాప్రతినిధులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. పట్టణ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి వార్డులో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానిక వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్, స్థానిక కౌన్సిలర్ టేకుల శిరీష నరేష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావుకు అభినందనల వెల్లువ

### బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ ఇంచార్జ్





**నేటి సాక్షి కోరుట్ల (రాధారపు నర్సయ్య):** తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం అనంతరం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు రాష్ట్ర స్థాయి ప్రముఖ నాయకులను మర్యాదపూర్వకంగా కలుస్తూ రాజకీయంగా మరింత చురుకుగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో బోధన్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను కలిసి ఆశీస్సులు పొందారు. తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం పొందిన సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా పనిచేయాలని సూచించినట్లు సమాచారం. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును జువ్వాడి నర్సింగరావు మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ప్రజలకు అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పెద్దలు సూచించగా, ప్రజా సేవను మరింత బాధ్యతగా కొనసాగిస్తానని జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు.

# పాలిసెట్ అభ్యర్థులకు చల్లని మంచినీరు, అరటిపండ్ల పంపిణీ

### జమాత్ ఇస్లామి హింద్ కోరుట్ల శాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం




**నేటి సాక్షి, కోరుట్ల:** కోరుట్ల పట్టణంలో పాలిసెట్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడకుండా జమాత్ ఇస్లామి హింద్ కోరుట్ల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు చల్లని మంచినీరు మరియు అరటిపండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాలిసెట్ పరీక్షకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు అరటిపండ్లు పంపిణీ చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఈ సేవా కార్యక్రమం అభ్యర్థులకు ఊరటనిచ్చింది. ఈ సందర్భంగా జమాత్ ఇస్లామి హింద్ నాయకులు మాట్లాడుతూ, 'భూమిపై ఉన్న వారిపై మనం కనికరిస్తే పైవాడు మనపై కరుణిస్తాడ'ని ప్రవక్త మొహమ్మద్ చెప్పిన సందేశాన్ని గుర్తుచేశారు. సమాజ సేవే నిజమైన మానవత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమాత్ ఇస్లామి హింద్ పట్టణ శాఖ అధ్యక్షులు ఇలియాజ్ అహ్మద్ ఖాన్, జిల్లా అధ్యక్షులు ఎండి నైముద్దీన్, ఎంఫీజే అధ్యక్షులు ఎండి నసీర్, ఎస్ఐఓ అధ్యక్షులు అద్నాన్, ఐటీఎస్ సెక్రటరీ ఎండి ఫసియొద్దీన్ షకీల్, ఎస్ఐఓ సభ్యులు అతాఉ రహ్మాన్ ఖాన్, ఒసామా, ఆరిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# అనధికార 'లే-అవుట్ల'పై మున్సిపాలిటీ ఉక్కుపాదం

### పెద్దమ్మ టెంపుల్ సమీపంలోని అక్రమ ప్లాట్ల హద్దురాళ్లు, ఖనీలు తొలగింపు

### అనుమతి లేని లే-అవుట్లలో ప్లాట్లు కొనొద్దని ప్రజలకు కమిషనర్ హెచ్చరిక



**నేటి సాక్షి,మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** మెట్‌పల్లి పట్టణ పరిధిలో అనుమతి లేకుండా వెలుస్తున్న అక్రమ 'లే-అవుట్ల'పై మున్సిపాలిటీ కఠిన చర్యలు ప్రారంభించింది. పట్టణంలోని పెద్దమ్మ టెంపుల్ సమీపంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన లే-అవుట్‌లోని హద్దురాళ్లు, ఖనీలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. పట్టణ ప్రణాళిక నిబంధనలను ఉల్లంఘిస్తూ అనుమతి లేకుండా ప్లాట్లు విక్రయించే వారిపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ప్రజలు మోసపోకుండా మున్సిపాలిటీ అనుమతి పొందిన లే-అవుట్లలో మాత్రమే ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు. మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఇటీవల అనుమతి లేకుండా ప్లాట్లు ఏర్పాటు చేస్తున్నారనే సమాచారంతో టౌన్ ప్లానింగ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో పెద్దమ్మ టెంపుల్ సమీప ప్రాంతంలో ఏర్పాటు చేసిన అనధికారిక లే-అవుట్‌ను గుర్తించిన మున్సిపల్ సిబ్బంది అక్కడి హద్దురాళ్లు, ఖనీలను తొలగించారు. అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసి ప్రజలను తప్పుదారి పట్టించే వారిపై భవిష్యత్తులో మరింత కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఎలాంటి లే-అవుట్లు, ప్లాట్లు ఏర్పాటు చేయాలన్నా తప్పనిసరిగా మున్సిపాలిటీ అనుమతి ఉండాలని తెలిపారు. అనుమతి లేని లే-అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో నిర్మాణ అనుమతులు లభించవని, మౌలిక వసతులు కూడా కల్పించబడవని హెచ్చరించారు. ప్రజలు పూర్తి వివరాలు తెలుసుకొని, మున్సిపాలిటీ ఆమోదం పొందిన లే-అవుట్లలో మాత్రమే పెట్టుబడులు పెట్టాలని సూచించారు అక్రమ నిర్మాణాలు, అనధికార లే-అవుట్ల నియంత్రణ కోసం ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. పట్టణ ప్రణాళిక నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ రాజేంద్రప్రసాద్, టీపీబీఓలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


# బస్సుల మధ్య ఇరుక్కొని బాలుడు మృతి

### కొమురం భీం ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్టాండ్ లో విషాద ఘటన చోటుచేసుకుంది.






**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్:** పెంచికల్ పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు తన మనవడు తరుణ్ (1.5)తో కలిసి కాగజ్‌నగర్ వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది అదే సమయంలో ఉట్నూర్ డిపోకు చెందిన మరో ఆర్టీసీ బస్సు రివర్స్ తీసుకోవడంతో బాలుడు రెండు బస్సుల మధ్య ఇరుక్కొని తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి బాలుడిని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో బస్టాండ్‌లో విషాద వాతావరణం నెలకొంది. చిన్నారి బాలుడు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు



# మిషన్ భగీరోత!


## తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న 'బండి భగీరథ్ పోక్సో' ఉదంతం



బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం
సోషల్ మీడియాలో అగ్గిరాజేసిన చర్చలు

నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

తెలంగాణ రాజకీయాల్లో గత 6 రోజులుగా.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు అత్యంత చర్చనీయాంశంగా మారింది. బాలిక ఫిర్యాదు, కేసు నమోదు, అరెస్ట్ డిమాండ్లు, రాజకీయ ఆరోపణలు, సోషల్ మీడియా చర్చలు, మహిళా సంఘాల నిరసనలు, సిట్‌ఏర్పాటు, హైకోర్టు ఆశ్రయం.. ఇలా ప్రతి రోజు కొత్త మలుపులు తిరుగుతూ ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించింది. ఒకవైపు 'చట్టం ముందు అందరూ సమానమేనా?' అనే ప్రశ్నలు వినిపిస్తుంటే, మరోవైపు 'ఇది రాజకీయ కక్ష సాధింపే'! అంటూ బీజేపీ ఎదురుదాడికి దిగింది. బీఆర్ఎస్ దీనిని ప్రధాన రాజకీయ అస్త్రంగా మలుచుకోగా, కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు వ్యవస్థపై ఒత్తిడి లేదని చెబుతోంది. సోషల్ మీడియాలో మాత్రం #JusticeForMinor, #ArrestBhageerath వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతూ ప్రజల్లో విభిన్న అభిప్రాయాలకు దారితీశాయి. రాజకీయ నేతలు, సినీ ప్రముఖులు, మహిళా సంఘాలు, ఇన్‌ఫ్ల్యుయెన్సర్లు, యూట్యూబ్ చానెల్లు వరుసగా స్పందిస్తూ ఈ కేసును రాష్ట్రవ్యాప్త చర్చగా మార్చేశారు. మైనర్ బాలికపై లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తన ఆరోపణలతో మే 8న పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆరోపణలు డిసెంబర్ 2025 నుంచి జరిగిన సంఘటనలు, మద్యం ఇవ్వడం, వివాహ వాగ్దానం చేసి మోసం చేయడం వంటివి. భగీరథ్ కౌంటర్ ఎఫ్ఐఆర్ లో హనీ ట్రాప్, ₹5 కోట్ల ఎక్స్‌టార్షన్ ఆరోపించాడు. కేసు రాజకీయంగా మారడంతో బిఆర్ఎస్ ఆందోళనలు, కాంగ్రెస్ ప్రభుత్వం 'సిట్' ఏర్పాటు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షణ చేశారు. భగీరథ్ అందుబాటులో (అబ్ స్కాండింగ్)లేకపోవడం, హైకోర్టు అంటిసిపేటరీ బెయిల్ పిటిషన్ ఫైల్ చేయడం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.దర్యాప్తు నివేదిక, కోర్టు తీర్పు మీద 'బండి సంజయ్' రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీసింది!




## భగీరథ్ పోక్సో కేసు : 30 కీలక అంశాలు




1. మే 8న 17 ఏళ్ల బాలిక తల్లిదండ్రులు పేట్ బషీరాబాద్ పోలీ సు స్టేషన్‌లో ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు కావడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.
2. పోక్సో చట్టం సెక్షన్లు 11, 12 కింద కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ సెక్షన్లు 74, 75 కూడా చేర్చారు.
3. డిసెంబర్ 31, 2025 మోయినాబాద్ ఫార్మ్‌హౌస్‌లో మద్యం ఇచ్చి వేధింపులు, మల్టిపుల్ ఇన్‌సిడెంట్స్, వివాహ వాగ్దానం వంటివి ఫిర్యాదు చేశారు.
4. కరీంనగర్‌లో భగీరథ్ కౌంటర్ కంప్లయింట్ చేశారు. హనీ ట్రాప్, 50 వేలు ఇచ్చినా.. 5 కోట్లు డిమాండ్, బ్లాక్‌మెయిల్ చేశారని పిటిషన్ ఇచ్చారు.
5. మే 9, 10: బీఆర్ఎస్ మహిళా నాయకులు ఆందోళనలు, పోలీస్ స్టేషన్ ముట్టడి, అరెస్టు డిమాండ్ చేశారు. స్టేట్ వుమెన్స్ కమిషన్‌కు మెమోరాండం, స్వతంత్ర దర్యాప్తు డిమాండ్ చేశారు.
6. బీఆర్ఎస్ నేతలు (కేటీఆర్): 'బేటా బగావో.. బేటా బచావో' - బీజేపీ బేటీ బచావో స్లోగన్‌ను ఎగతాళి చేశారు.
7. మూడు నెలలుగా చర్యలు ఎందుకు లేవన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. మహిళా సంఘాలు బాధితురాలికి రక్షణ కల్పించాలని కోరాయి.
8. బీఆర్ఎస్ మొదటగా ఈ అంశంపై తీవ్ర స్థాయిలో స్పందించింది.ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నేతృత్వంలో కోరుట్ల నియోజకవర్గంలో నిరసనలు జరిగాయి.
9. 'రక్షకుడే భక్షకుడు' అంటూ బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు చేసింది. బండి సంజయ్ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.
10. బీజేపీ వర్గాలు మాత్రం ఇది హనీ ట్రాప్'.. 'రాజకీయ కుట్ర' అంటూ ఆరోపించాయి. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు 'తండ్రికి కుమారుడి వ్యవహారంతో సంబంధం లేదు' అన్నారు.
11. కాంగ్రెస్ శ్రేణులు పోలీసులపై ఒత్తిడి లేదని చెబుతున్నాయి.సీఎం రేవంత్ రెడ్డి విచారణలో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.సీఎం ఆదేశాలతో సిట్‌ఏర్పాటు చేయబడింది.
12. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సిట్‌చీఫ్‌గా నియమితులయ్యారు. బాధితురాలి స్టేట్‌మెంట్ మళ్లీ రికార్డు చేసింది. టెక్నికల్ ఆధారాల సేకరణ ప్రారంభమైంది.
13. కాల్ డేటా, డిజిటల్ సమాచారం పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని కచ్చితంగా పట్టుకుంటాం' అని సిట్ చీఫ్ చెప్పారు.
14. భగీరథ్ ఆచూకీపై చర్చ మొదలైంది. కేసు నమోదు తర్వాత సోషల్ మీడియాలో రాజకీయ ట్రోలింగ్ పెరిగింది.
15. యూట్యూబ్ రాజకీయ విశ్లేషకులు దీన్ని '2026లో అతిపెద్ద రాజకీయ దుమారం'గా పేర్కొన్నారు. మహిళా హక్కుల సంఘాలు వేగవంతమైన విచారణ కోరాయి.
16. 'పోక్సో కేసుల్లో సాధారణ వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేస్తారు'.. అదే 'వీఐపీలకు వేరే చట్టమా?' అన్న విమర్శలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.
17. బీజేపీ నేతలు మాత్రం 'చట్ట ప్రక్రియ కొనసాగుతోంది' అని చెబుతున్నారు.
18. కాంగ్రెస్ ప్రభుత్వం తటస్థంగా వ్యవహరిస్తోందని అధికార వర్గాలు చెబుతున్నాయి.
19. బీఆర్ఎస్ మాత్రం 'రేవంత్–బండి మధ్య రహస్య ఒప్పందం ఉందని?' ఆరోపిస్తోంది.
20. కొంతమంది ఇన్‌ఫ్ల్యుయెన్సర్లు కేసు ఆలస్యం వెనుక రాజకీయ ఒత్తిళ్లను ప్రస్తావిస్తున్నారు. మరికొందరు 'మీడియా ట్రోల్స్'పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
21. సినీ నటుడు ప్రకాష్ రాజ్ కూడా స్పందిస్తూ.. 'అరెస్ట్ ఎందుకు చేయట్లేదు.?' 'బేటీ బచావోను.. వదిలేసి బేటా బచావో' ఏంటీ? అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.
22. తెలంగాణ రాజకీయాల్లో ఈ కేసు ప్రధాన చర్చగా మారింది. బీజేపీకి ఇది ఇమేజ్ సమస్యగా మారిందని విశ్లేషణలు వచ్చాయి.
23. బండి సంజయ్ కరీంనగర్ లో నిర్వహించిన 'హిందూ ఏక్తా యాత్ర' కార్యక్రమంలో తన కుటుంబాన్ని క్షోభకు గురి చేస్తున్నారని కన్నీరు పెట్టారు. కన్నపేగు తల్లడిల్లుతోందన్నారు.
24. 'హార్ట్‌లో స్టంట్ ఉన్నా.. హార్ట్ ఫుల్'గా పనిచేస్తున్నాని చెప్పుకొచ్చారు. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తామని.. నా కొడుకు తప్పు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవచ్చన్నారు.
25. 'పోక్సో–చట్టం'పై ప్రజల్లో మళ్లీ చర్చ మొదలైంది. న్యాయ నిపుణులు 'మైనర్ కేసుల్లో వేగవంతమైన చర్య అవసరమం'టున్నారు.
26. సోషల్ మీడియాలో బాధితురాలి గోప్యతపై కూడా చర్చ జరిగింది. కొంతమంది జర్నలిస్టులు 'సెన్సేషనలిజం వద్దు' అని హెచ్చరించారు.




27. భగీరథ్'హనీట్రాప్'.. మీడియా 'మనీ ట్రాప్'లో ఇరుక్కున్నారని.. సోషల్ మీడియాలో దుమ్ముదుమారమవుతోంది.
28. రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని పరస్పర దాడులకు వేదికగా మార్చుకున్నాయి. అన్ని పార్టీలు ఒకటేనని.. అందరూ 'అక్రమ సంబంధీకులే'నంటూ బురద చల్లుకుంటున్నారు.
29. మరోవైపు హైకోర్టును ఆశ్రయించిన భగీరథ్ కేసును కొత్త దశలోకి తీసుకెళ్లింది. కేసు కొట్టివేయాలని భగీరథ్ పిటిషన్ దాఖలు చేసి ట్విస్ట్ ఇచ్చారు.
30. రాజకీయ నేతలు, సినీ ప్రముఖులు, మహిళా సంఘాలు, ఇన్‌ఫ్ల్యుయెన్సర్లు, యూట్యూబ్ చానెల్లు వరుసగా స్పందిస్తూ ఈ కేసును 'మిషన్ భగీ'రోత'గా మారిందంటూ రాష్ట్రవ్యాప్తంగా చర్చించుకుంటున్నారు.

### కొసమెరుపు

ఇది 'పోక్సో' కేసా.? 'హనీ ట్రాప్' కేసా అన్నది.. ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఉంటే 'చట్టం తన పని తాను చేసుకుని 'అసలు నిందితులను' పట్టుకునే అవకాశం ఉంటుంది. లేదంటే సామాన్యులకు ఓ రకంగా.. సర్కారు పెద్దలకు ఓ రకంగా మార్చేసి 'చట్టం'లా పని చేస్తారని జనాలు ఈసడించుకునే ఛాన్స్ ఉంది.. ఈ కేసు ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో.. ఊహించని 'ట్విస్ట్'లు ఇస్తుందో.. వెయిట్ అండ్ సీ!





# విప్లవ స్టూడెంట్!

## ఆయుధం వదిలి.. అక్షరం వైపు!

### అడవుల్లో గన్ను పట్టిన చేతులు.. పరీక్షా హాల్‌లో పెన్ను పట్టాయి

### 42 ఏళ్ల తర్వాత ఇంటర్ తెలుగు పరీక్ష రాసిన మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ



నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

అక్షరం వదిలి అజ్ఞాత బాటపట్టి.. నాలుగు దశాబ్దాల పాటు ఆయుధంతోనే కాలం గడిపిన అగ్రనేత.. మళ్లీ అక్షరం కోసం పరీక్షా కేంద్రంలో అడుగు పెట్టాడు! సాధారణంగా ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో కనిపించేవారు యువ విద్యార్థులే. భవిష్యత్తు కోసం కలలు కనే కుర్రాళ్లు... ఉద్యోగాల కోసం పోటీ పడే యువత.. ఒత్తిడితో పుస్తకాలు తిరగేస్తూ కనిపించే విద్యార్థులు. కానీ జగిత్యాల జిల్లా కోరుట్లలో బుధవారం నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రంలో కనిపించిన ఒక వ్యక్తి మాత్రం అందరి దృష్టిని ఆకర్షించాడు. నెరిసిన తెల్లజుట్టు.. అనుభవాలతో నిండిన ముఖం.. చేతిలో ఒక సాధారణ పెన్ను.. కానీ ఆ పెన్ను వెనుక నాలుగు దశాబ్దాల కథ ఉంది. ఒకప్పుడు అడవుల్లో తుపాకీతో తిరిగిన మాజీ మావోయిస్టు అగ్రనేత.. నేడు విద్యార్థిగా పరీక్షా హాల్‌లోకి అడుగుపెట్టాడు. ఆయనే దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి! ఇది కేవలం ఒక మాజీ మావోయిస్టు పరీక్ష రాశాడనే వార్త కాదు. ఇది కాలం తిరిగిన చరిత్ర. ఒక వ్యక్తి జీవిత ప్రయాణం. ఒక తరం ఆవేదన. ఒక భావజాలం నుంచి మరో మార్గం వైపు మలుపు తిరిగిన జీవన గాథ.!





### కోరుట్ల కళాశాల నుంచి అడవిబాట

1984-85 విద్యా సంవత్సరంలో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న తిప్పిరి తిరుపతి సాధారణ విద్యార్థి కాదు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, పేదల పరిస్థితులు, భూస్వామ్య దౌర్జన్యాలు ఆయన మనసును కదిలించాయి. ఆ కాలంలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో విప్లవ భావజాలం బలంగా వ్యాపిస్తోంది. విద్యార్థి ఉద్యమాలు వేడెక్కుతున్న రోజులు అవి. రాడికల్ స్టూడెంట్ యూనియన్ ప్రభావం యువతపై తీవ్రంగా కనిపించింది. అదే ప్రభావంతో తిరుపతి కూడా ఉద్యమంలోకి అడుగుపెట్టారు. కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్గనైజర్‌గా పనిచేస్తూ విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. అయితే అదే సమయంలో కళాశాల పరిసరాల్లో చోటుచేసుకున్న కొన్ని సంఘటనలు, గొడవలకు సంబంధించిన కేసులు ఆయన జీవితాన్ని మలుపుతిప్పాయి. మిగతా అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించినప్పటికీ... ఇంటర్ సెకండియర్ తెలుగు పరీక్ష మాత్రం పూర్తి చేయలేకపోయారు. ఆ ఒక్క పరీక్ష అసంపూర్తిగానే మిగిలిపోయింది.

### విద్యార్థి నుంచి విప్లవకారుడిగా..

తెలుగు పరీక్ష తప్పిన తర్వాత తిరుపతి జీవితం పూర్తిగా మారిపోయింది. కళాశాల గదుల నుంచి అడవుల దారిని ఎంచుకున్నారు. కుటుంబం, చదువు, సాధారణ జీవితం అన్నింటినీ పక్కనబెట్టి విప్లవ ఉద్యమంలో కలిసిపోయారు. అడవులు ఆయనకు ఆశ్రయమయ్యాయి. తుపాకీ ఆయనకు ఆయుధమైంది. సిద్ధాంతం ఆయనకు జీవితం అయింది. దశాబ్దాల పాటు ప్రజా పోరాటాల్లో పాల్గొంటూ 'దేవ్ జీ'గా మావోయిస్టు ఉద్యమంలో కీలక నేతగా ఎదిగారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయుధ పోరాటమే మార్గమని నమ్మిన తరానికి ఆయన ప్రతినిధిగా నిలిచారు. ఒకప్పుడు విప్లవ నినాదాలతో మారుమోగిన ఆయన జీవితం... కాలంతో పాటు మారిపోయింది. పోరాటాల రూపం మారింది. సమాజ పరిస్థితులు మారాయి. చివరకు దేవ్ జీ కూడా జనజీవన స్రవంతిలోకి తిరిగి వచ్చారు.



### అసంపూర్తిగా మిగిలిన తెలుగు పరీక్ష!

మావోయిస్టు ఉద్యమాన్ని వీడి ఇటీవల సీఎం, డీజీపీ సమక్షంలో లొంగిపోయిన దేవ్ జీ.. జీవితంలో ఒక అసంపూర్తి మాత్రం ఎప్పటికీ తనను వెంటాడుతోందని సన్నిహితుల వద్ద చెప్పినట్లు తెలుస్తోంది. అది 1984-85లో రాయకపోయిన తెలుగు పరీక్ష. నలభై ఏళ్లకు పైగా గడిచిపోయినా ఆ పరీక్ష ఆయన మనసులో మిగిలిపోయింది. చివరకు ఆ అసంపూర్తిని పూర్తి చేయాలనే సంకల్పంతో ఇంటర్ బోర్డును సంప్రదించారు. ప్రత్యేక అనుమతి పొందారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా తెలుగు పరీక్ష రాసేందుకు అవకాశం దక్కింది. ఇక బుధవారం మధ్యాహ్నం కోరుట్లలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు దేవ్ జీ హాజరయ్యారు. దాదాపు 42 ఏళ్ల తర్వాత పరీక్షా హాల్లోకి అడుగుపెట్టిన ఆయనను చూసి విద్యార్థులు, సిబ్బంది ఆశ్చర్యపోయారు. కొందరు ఆసక్తిగా గమనించారు. మరికొందరు ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించారు.




### తమ్ముడు ఇచ్చిన పెన్నుతో పరీక్ష!

ఈ కథలో అందరినీ కదిలించిన మరో భావోద్వేగ అంశం కూడా ఉంది. లొంగిపోయిన సమయంలో ప్రేమతో తన తమ్ముడు బహుమతిగా ఇచ్చిన పెన్నుతోనే దేవ్ జీ ఈ పరీక్ష రాయడం. ఒకప్పుడు గన్ను పట్టిన చేతిలో... ఇప్పుడు తమ్ముడు ఇచ్చిన పెన్ను కనిపించడం చాలామందిని ఆలోచింపజేసింది. 'ఆయుధం నుంచి అక్షరం వైపు' అనే మాటకు ఆయన జీవితం ప్రత్యక్ష ఉదాహరణగా మారింది. తెలుగు సబ్జెక్టుపై అవగాహన పెంచుకునేందుకు గత కొన్ని రోజులుగా ఆయన ప్రత్యేకంగా సిద్ధమయ్యారు. అరుణోదయ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు లావణ్య కూడా ఆయనకు ట్యూషన్ చెప్పి..తానెప్పుడో కోల్పోయిన సబ్జెక్టును బోధించి పరీక్షకు సన్నద్ధం చేశారు. అప్పటి సబ్జెక్ట్ కు..ఇప్పటి సబ్జెక్ట్ కు ఎంతో మార్పు ఉన్నప్పటికీ.. చాలా త్వరగానే దేవ్ జీ' నేర్చుకున్నాడని.. అందుకే ఆయన అంత గొప్ప స్థాయికి చేరుకున్నాడని ఆమె అభిప్రాయపడ్డారు. అతని పట్టుదలకు ఖచ్చితంగా 60 మార్కులు తెచ్చుకుంటారని ట్యూషన్ టీచర్ లావణ్య పేర్కొన్నారు. ఆయనకు తాను టీచింగ్ చేయడమాని భయం వేసిందని చెప్పుకొచ్చారు.!

### ఇంటర్ తర్వాత లక్ష్యం.. న్యాయవాద వృత్తి!

పరీక్షకు హాజరైన అనంతరం దేవ్ జీ మాట్లాడిన మాటలు మరింత చర్చనీయాంశమయ్యాయి.'ఇంటర్ పూర్తి చేసిన తర్వాత న్యాయ విద్య అభ్యసించాలని ఉంది. పేదలకు న్యాయ సహాయం అందించాలనేది నా కోరిక'ని ఆయన తెలిపారు. ఒకప్పుడు తుపాకీ ద్వారా మార్పు తీసుకురావాలని నమ్మిన వ్యక్తి.. ఇప్పుడు చట్టం ద్వారా పేదలకు సహాయం చేయాలనుకోవడం కాలం తీసుకొచ్చిన పెద్ద మార్పుగా చాలామంది భావిస్తున్నారు.

### ఒక తరం చరిత్రకు ప్రతిబింబం!

దేవ్ జీ కథను కేవలం వ్యక్తిగత సంఘటనగా చూడటం సరైంది కాదు. ఇది 1980ల తెలంగాణ సామాజిక పరిస్థితులకు అద్దం పడే కథ. ఆ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, అసమానతలు, భూస్వామ్య వ్యవస్థల దౌర్జన్యాలు తీవ్రంగా ఉండేవి. ఆ పరిస్థితుల్లో అనేక మంది యువకులు చదువును, కుటుంబాలను వదిలి విప్లవ ఉద్యమాల్లో చేరిపోయారు. వారికి తుపాకీ మార్గమే న్యాయం సాధించే సాధనంగా కనిపించింది. దేవ్ జీ కూడా అలాంటి తరానికి ప్రతినిధి. కానీ నేటి ఆయన నిర్ణయం మరో సందేశాన్ని ఇస్తోంది. సమాజాన్ని మార్చడానికి కేవలం ఆయుధం కాదు... విద్య కూడా ఒక శక్తి అని ఆయన జీవితం చెబుతోంది.

### తెలుగు పరీక్షలో దాగిన జీవన సత్యం

ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం ఉంది. దేవ్ జీ జీవితంలో అసంపూర్తిగా మిగిలింది తెలుగు పరీక్షే. అది కేవలం ఒక సబ్జెక్టు కాదు. మన భాష.. మన సంస్కృతి.. మన ఆత్మతో ముడిపడిన అంశం. ఒకప్పుడు విప్లవ నినాదాలు ఇచ్చిన వ్యక్తి.. ఇప్పుడు తెలుగు ప్రశ్నాపత్రానికి సమాధానాలు రాయడం కాలం ఆడిన అద్భుతమైన వ్యంగ్యంలా కనిపించినా.. అదే సమయంలో అది ఒక గొప్ప జీవన సత్యాన్ని గుర్తు చేస్తోంది. చివరికి మనిషిని నిలబెట్టేది జ్ఞానం.. విద్య.. భాష మాత్రమే.!

### దేవ్ జీ కథ ఎందుకు వైరల్ అవుతోంది?

ఈ రోజుల్లో చిన్న అపజయానికే చదువును వదిలేసే యువత చాలామంది ఉన్నారు. అలాంటి సమయంలో 42 ఏళ్ల తర్వాత కూడా ఒక పరీక్ష పూర్తి చేయాలనే పట్టుదలతో పరీక్షా హాల్లో కూర్చోవడం సాధారణ విషయం కాదు. అందుకే దేవ్ జీ కథ ఇప్పుడు కేవలం కోరుట్ల పట్టణ చర్చగా మిగల్లేదు. అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చాలామందికి ప్రేరణగా మారుతోంది. ఒకప్పుడు 'విప్లవకారుడు'గా గుర్తింపు పొందిన వ్యక్తి.. ఇప్పుడు 'స్టూడెంట్'గా వార్తల్లో నిలవడం కాలం రాసిన అరుదైన కథగా మారింది.

### గన్ను నుంచి పెన్ను వరకు..

దేవ్ జీ జీవిత ప్రయాణం ఒక పెద్ద సందేశాన్ని ఇస్తోంది. గన్ను చేతిలో ఉన్నప్పుడు పోరాటం కనిపించింది. పెన్ను చేతిలోకి వచ్చినప్పుడు పరివర్తన కనిపించింది. అడవుల్లో విప్లవం కోసం నడిచిన అడుగులు.. ఇప్పుడు పరీక్షా హాల్లో విద్య కోసం నడవడం.. ఇదే కాలం గొప్పతనం. ఒకప్పుడు విప్లవానికి ప్రతీకగా నిలిచిన 'దేవ్ జీ'.. ఇప్పుడు విద్యకు ప్రతీకగా మారారు. ట్రెండ్ సెట్టర్లు ఎప్పుడూ చర్చనీయాంశం అవుతుంటారు.. సమాజానికి చక్కని సందేశం ఇస్తుంటారు!

